www.prajaswaramdaily.com
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 285 | పేజీలు : 16 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | మంగళవారం 25-06-2024

MHR TV
www. mhrtv.com



## నూతన లక్ష్యంతో
# ముందుకెళ్తాం



- వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తాం
- 140 కోట్ల ప్రజల ఆకాంక్షలునెరవేరుస్తాం..
- జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి
- రేపటితో ఎమర్జెన్సీకి 50 ఏండ్లు పూర్తి
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- ప్రారంభమైన 18 లోక్ సభ సమావేశాలు | 2
- ప్రధాని సహా ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్
- రేపు స్పీకర్ ప్రమాణ స్వీకారం



## ఢిల్లీలో రేవంత్ బిజీబిజీ

రాహుల్ గాంధీ, ఖర్గేతో భేటీ
మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ ఎంపికపై చర్చ..!

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం | 7

టీ కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం




## కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు షాక్

గతంలో ఇచ్చిన బెయిల్, స్టేపై కోర్టులో సవాల్

హైకోర్టు ఆదేశాలు వచ్చే వరకు వేచి చూడాలని స్పష్టం

ఈ నెల 26న విచారణ చేపట్టనున్నట్టు వెల్లడి | 6

## హిందుజా కుటుంబానికి నాలుగున్నరేండ్లు జైలు



స్విట్జర్లాండ్ క్రిమినల్ కోర్టు తీర్పు

దోపిడీ, మానవ అక్రమ రవాణా, కార్మిక చట్టాల ఉల్లంఘనపై కేసు | 5

గ్రామాలు, రహదారులు, వెంచర్లు...
మూడు క్యాటగిరీలుగా విభజన
నివాస స్థలాలకు ప్రతి చదరపు గజానికి రూ.1,000

తొమ్మిదేళ్లు కాదు... తొబ్బై శాతం పూర్తైన భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రక్రియ
త్వరలో ప్రభుత్వానికి నివేదిక..
కొత్త ధరలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్
ఆగస్టు 1 నుంచి అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు

# ఎకరానికి 4 లక్షలు..!

వ్యవసాయ భూముల కనీస విలువ నిర్ధారణ..!



**హైదరాబాద్ జూన్ 24 (ప్రజాస్వరం):** రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరణ కసరత్తు కొలిక్కి వస్తోంది. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల కనీస విలువపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఓ అభిప్రాయానికి వచ్చింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలోని ప్రతి ఎకరా వ్యవసాయ భూమి కనీస విలువను రూ.4 లక్షలుగా నిర్ధారించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. వాస్తవానికి ఈ విలువను రూ.4–5 లక్షలు చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మౌఖికంగా సూచించింది. అయితే, ఏజెన్సీ ఏరియాల్లో ఈ విలువలు సరిపోయే అవకాశం లేనందున భద్రాచలం, ములుగు, ఆసిఫాబాద్ లాంటి ప్రాంతాలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూమి కనీస రిజిస్ట్రేషన్ విలువను రూ.4 లక్షలు చేయాలని మిగతా 2 లో..

## జూడాల స్ట్రైక్

- గాంధీ, ఉస్మానియాల్లో విధులు బహిష్కరించిన డాక్టర్లు
- ఆరు నెలలుగా స్టైఫండ్ సమయానికి ఇవ్వడం లేదు
- వైద్యులపై దాడులను అరికట్టాలి
- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక | 2



హైదరాబాద్ గాంధీ దవాఖానలో సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు

## మళ్లీ.. చరిత్ర పునరావృతమౌతుంది



- అధికారంలో ఉన్నామని ఇష్టారాజ్యంగా వ్యవహరించొద్దు
- ఇలాంటి కష్టసమయాలు బీఆర్ఎస్ కు కొత్త కాదు
- కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధిచెబుతారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ట్వీట్ | 6




## బీఆర్ఎస్ న్యాయపోరాటం

- పార్టీ మారుతున్న వారిపై సుప్రీం కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం
- కేసీఆర్, కేటీఆర్‌లకు అత్యంత సన్నిహితులు వెళ్తుండడంపై ఆవేదన | 6
- బుజ్జగిస్తున్నా మాట వినకపోవడంతో అనర్హత వేటు వేయించేందుకు నిర్ణయం
- తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే కాంగ్రెస్ లో చేరిక

## సంజయ్ చేరిక...
## జీవన్ రెడ్డి అలక

తనతో చెప్పకుండా పార్టీలో చేర్చుకోవడంపై అసహనం

తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సంజయ్ చేతిలో ఓటమి

బుజ్జగిస్తున్న కాంగ్రెస్ నేతలు | 2



## 44 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం | 2






## సూరజ్ రేవణ్ణ అరెస్టు

తనపై లైంగికదాడి చేశాడని డీజీపీకి బాధితుడి ఫిర్యాదు | 2



జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

# హుస్నాబాద్ లో మెగా జాబ్ మేళా

### పెద్ద ఎత్తున హాజరైన నిరుద్యోగులు

### ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :** యువజన సర్వీసుల శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హుస్నాబాద్ లో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వైస్ చైర్మన్ అయిలేని అనిత, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆర్డీవో శ్రీరామమూర్తి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ మెగా జాబ్ మేళాకి మంచి స్పందన వచ్చింది. నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరైంది. దాదాపు 60 కి పైగా కంపెనీలు పాల్గొనగా, 5000 ఉద్యోగాల నియామకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జాబ్ మేళా కి వచ్చిన వారికి ఇబ్బందులు కలగకుండా హెల్త్ క్యాంప్ లు, భోజన వసతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా కు జీరో నుండి పీజీ వరకు నియోజవర్గం నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారు ఆరు వేల మంది ఉన్నారని తెలిపారు. ఎక్కడ ఏ కంపెనీ లో జాబ్ కావాలంటే అక్కడ ఇంటర్వ్యూ కి అటెండ్ కావాలని పేర్కొన్నారు. తదుపరి జాబ్ మేళా మండల స్థాయిలో నిర్వహిస్తామని వివరించారు. జాబ్ మేళా కోసం వేలాదిగా యువత తరలివచ్చారని, వారందరికీ ఇది మంచి అవకాశమన్నారు. అర్హత ఉన్నవారు ఉద్యోగంతో ఇక్కడి నుండి వెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇవే కాకుండా విదేశాల్లో కూడా నర్సింగ్ , నిర్మాణ రంగం, ఇతర రంగాల్లో లక్షల్లో జీతాలు వచ్చే ఉద్యోగాలు ఉన్నాయని, మండలాల వారీగా ఇలాంటివి ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల వారికి కూడా ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. రాత్రి 10 అయినా సరే ఇక్కడే ఉండి ఓపికగా ఇంటర్వ్యూ అటెండ్ కావాలని సూచించారు. హుస్నాబాద్ లో మొదటిసారి జాబ్ మేళా జరుగుతున్నదని, ప్రభుత్వం నుంచి పకడ్బందీగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. నిరుద్యోగులకు దాదాపు ఉద్యోగాలు వచ్చేలా అవకాశాలు కల్పించేందుకు కషి చేస్తామన్నారు. ఇవే కాకుండా పాల ఉత్పత్తి, చేపల పెంపకం, గ్రామీణ పరిశ్రమలు కల్పించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి టూరిజం గా కూడా అభివృద్ధి చేస్తామన్నారు. అందరూ మంచిగా ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగాలు పొందిన లెటర్ లతో ఇంటికి పోవాలన్నారు.



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ, యువకులు

# సంజయ్ చేరిక... జీవన్ అలక...

### తనతో చెప్పకుండా పార్టీలో చేర్చుకోవడంపై అసహనం

### రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు సైడ్ ఎఫెక్ట్

కరీంనగర్, జూన్ 24, (ప్రజాస్వరం) : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ సైడ్ ఎఫెక్టులు ఆ పార్టీకి కనిపిస్తున్నాయి. కొత్తగా చేరే వారి వల్ల కొత్త కొత్త సమస్యలు వస్తున్నాయి. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు అయిన సంజయ్ కుమార్ ఇలా హ్యాండివ్వడంతో బీఆర్ఎస్ లో పెద్ద సంచలనం అయింది. అయితే ఈ చేరిక కాంగ్రెస్ లోనూ అలజడికి కారణం అవుతోంది.జగిత్యాల నుంచి కాంగ్రెస్ పార్టీకి అత్యంత సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్ రెడ్డి ఉన్నారు. ఆయన చాలా ఆయన 1983 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. కాంగ్రెస్ తరపున ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత ఆయన వరుసగా మూడు సార్లు ఓడిపోయారు. గత రెండు సార్లు ఆయనపై బీఆర్ఎస్ తరపున పోటీ చేసి న డాక్టర్ సంజయ్ కుమార్ గెలిచారు. సంజయ్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. తనపై గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కనీసం తనకు చెప్పకుండా పార్టీలో చేర్చుకోవడంపై తాటిపర్తి జీవన్ రెడ్డి అసహనానికి గురయ్యారు. తనకు ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటానని ఆయన చెబుతున్నారు.

2018లో ఓడిపోయిన తర్వాత ఆయన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయినప్పటికీ గత ఎన్నికల్లో ఆయనకు జగి త్యాల నుంచి టిక్కెట్ లభించింది. గత పార్ల మెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి కూడా టిక్కెట్ లభించింది. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌కు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ పరాజయం పాలయ్యారు. ఇప్పుడు సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరితే ఇక తనకు రాజకీయ భవిష్యత్ ఉండదని ఆయన అనుకుంటున్నారు. తన సీనియార్టీకి తగ్గట్లుగా ఓడిపోయినప్పటికీ మంత్రి పదవి వస్తుందని ఆయన అనుకుంటున్నారు .కానీ అలాంటి చాన్స్ లేకపోగా ఇప్పుడు తన సీటుకే ఎసరు పెడుతున్నారని ఆయన నమ్ముతున్నారు. జీవన్ రెడ్డి అసంతృప్తి గురించి తెలుసుకుని కాంగ్రెస్ నేతలు ఆయనను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే నలభై ఏళ్ల పాటు చేసిన రాజకీయంలో గౌరవంగా బతికానని ఇప్పుడు ఇలాగే కొనసాగితే తన గౌరవం పోతుందని.. రాజకీయాల నుంచి విరమించుకుని వ్యవసాయం చేసుకుంటానని ఆయన చెబుతున్నట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో జోరుగా సాగుతున్న చేరికల వల్ల మరికొన్ని సైడ్ ఎఫెక్టులు కనిపించే అవకాశాలు ఉన్నాయి.

# 44 మంది ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్ జూన్ 24 (ప్రజాస్వరం) :** తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. 44 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. 1.పశసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి– సవ్యసాచి ఘోష్, 2.కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శి– సంజయ్ కుమార్, 3.యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి– వాణి ప్రసాద్, 4. చేనేత, హస్తకళల ముఖ్యకార్యదర్శి– శైలజా రామయ్య, 5. హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్ ఎండీ– శైలజకు అదనపు బాధ్యతలు, 5.అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి– అహ్మద్ నదీమ్, 7. టీపీటీఆర్ఐ డీజీగా అహ్మ ద్ నదీమ్‌కు అదనపు బాధ్యతలు, 8.ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి– సందీ ప్ సుల్తానియా, 9. ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా సందీప్ సుల్తానియాకు అదనపు బాధ్యతలు, 10. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా కొనసాగనున్న సందీప్, 11.వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి–రిజ్వి, 12. జీఏడీ ముఖ్యకార్యదర్శి–సుదర్శన్ రెడ్డి, 13.జీహెచ్ఎంసీ కమిషనర్ – అమ్రపాలి కాటా, 14.టూరిజం డైరెక్టర్–ఇలా త్రిపాఠి, 15. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్–స్నేహా శబరి, 16.రాష్ట్ర ఆర్థిక సంఘం ఎండి– కాత్యాయని దేవి, 17.పాఠశాల విద్యా డైరెక్టర్– నర్సింహారెడ్డి, 18. సమగ్రా శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నర్సింహారెడ్డికి అదనపు బాధ్యతలు, 19.వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ– సహదేవరావు, 20.జీహెచ్ఎంసి ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్– హెచ్‌కె పాటిల్, 21.జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్– అపూర్వ చౌహాన్, 22.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్– అభిషేక్ అగస్త్య, 23. భద్రాచలం ఐటీడీఏ పీవో– రాహుల్, 24. మూసీ అభివృద్ధి జెఎండీ– గౌతమి, 25జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్– ఉపేందర్ రెడ్డి, 26.టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్– నిఖిల్ చక్రవర్తి.

# ఈశ్వరమ్మపై దాడి అమానవీయం

### ప్రతి ఒక్కరూ తలదించుకునే ఘటన

### పూర్తి సమాచారం సేకరించి కఠిన చర్యలు తీసుకుంటాం

### ప్రభుత్వం తరఫున అండగా ఉంటాం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### నిమ్స్ బాధితురాలికి పరామర్శ

**నాగర్ కర్నూలు జూన్ 24, (ప్రజాస్వరం):** కొల్లాపూర్ మండలం, మొలచింతలపల్లి కి చెందిన చెంచు గిరిజన మహిళ ఈశ్వరమ్మ పై జరిగిన అత్యాచారం ఘటన అమాన వీ యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉదయం నిమ్స్ హాస్పిట ల్ లో బాధితురాలు ఈశ్వరమ్మను ఆమె కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మంత్రి జూపల్లి తో కలిసి మీడియాతో మాట్లాడారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు తలదించుకునే ఘటన ఇది అని పేర్కొన్నారు. యావత్ సమాజం తీవ్రంగా ఖండించాల్సిన అంశం ఇది అన్నారు. ఘటన గురించి తెలిసిన వెంటనే మంత్రి జూపల్లి కృష్ణారావు బాధితురాలిని నాగర్ కర్నూల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారని, మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి సైతం తీసుకొచ్చారని వివరించారు. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. ఈశ్వరమ్మ తిరిగి పూర్తిగా ఆరోగ్యంతో కోలుకునే వరకు ఉచితంగా ప్రభుత్వం వైద్య సాయం అందిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇల్లు లేని పక్షంలో ఇందిరమ్మ ఇల్లు, ఇద్దరు పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించి చదివిస్తామని పేర్కొన్నారు. సాగుకు వ్యవసాయ భూమి కేటాయించడం వంటి అన్ని చర్యలు ప్రభుత్వపరంగా తీసుకుంటామన్నారు. ఈశ్వరమ్మ ఘటనలో సమీప బంధువులైన బావ, అక్క తో బాటు బయటి వ్యక్తులు ఒకరిద్దరు ఉన్నట్టు సమాచారం ఉందని తెలిపారు. నిందితులను ఇప్పటికే రిమాండ్‌కు తరలించారని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మీడియా సమావేశానికి ముందు ఆసుపత్రిలో ఈశ్వరమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం అందుతున్న వైద్య సాయం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని, పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న తర్వాతే డిశ్చార్జ్ చేయాలని కోరారు.

**ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం...**

చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. భూమి అమ్మడం లేదని 20 రోజుల క్రితం ఈశ్వరమ్మ మామ నాగన్నను హత్య చేసిన విషయం సోమవారం తెలిసింది. చెంచుల భూముల పై కొంత మంది గ్రామస్థులు కన్నేశారు. ఈ నెల 3న ఈశ్వరమ్మ చిన్నమామ కాట్రాజు నాగన్న (56)కు చెందిన 2.5 ఎకరాల భూమిని బండి వెంకటేష్ ఎకరా రూ. 20 లక్షలు పలుకుతుండగా రూ. 4.5 లక్షల చొప్పున ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అందుకు నాగన్న ఒప్పుకోకపోవడంతో గ్రామ శివారులో అతడిని హత్య చేశారు. శవ పరీక్ష నిర్వహించకుండానే అంత్యక్రియలు చేశారు. భూ తగాదా నేపథ్యంలో నాగన్నను హత్య చేసి ఉంటారనే ఆరోపణలు వస్తున్నాయి. చెంచుల అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి భూమిని దక్కించుకునేందుకు నాగన్న హత్య చేసేందుకు కూడా వెనకడలేదన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి.

చెంచు మహిళ ఈశ్వరమ్మ భూమిని కౌలు తీసుకున్న వ్యక్తులు ఆమెపై పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈశ్వరమ్మ, భర్త ఈదన్న తమ వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. ఆ భూమిలో వెంకటేశ్ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం పెట్టుకోగా తన దగ్గరే ఈదన్న, బాధితురాలు ఈశ్వరమ్మ పని చేసేవారు.

ఈశ్వరమ్మ పనికి రావడంలేదని ఆమె మర్మాం గాలపై కారం చల్లి, డీజిల్ పోసి నిప్పంటించి పాశవికంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈశ్వరమ్మ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిమ్స్ వైద్యులకు ఆదేశించారు.

# అనర్హుల రేషన్ కార్డులు.. పెన్షన్లు తొలగిస్తాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్ జూన్ 24 (ప్రజాస్వరం ) :** తెలంగాణలో అనర్హులు పొందుతున్న రేషన్ కార్డులు, పెన్షన్లను తొలగిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ పథకాల్లో పేద కుటుంబాలకే ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. జులై 1 నుంచి ఆగస్టు చివరిలోపు అర్హత కలిగిన ప్రతి రైతుకూ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని అన్నారు.

# మాజీ ఎమ్మెల్యేపై రిటైర్డ్ ఎస్పీ ఫిర్యాదు

### అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్

**అనంతపురం జూన్ 24 (ప్రజాస్వరం ):** అనంతపురం అర్బన్ వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిపై రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ బాలనరసింహారెడ్డి సీఎం చంద్రబా బుకు ఫిర్యాదు చేశారు. అనంత వెంకట్రామిరెడ్డి అక్రమాలపై విచారణ జరిపించాలని సీఎంను కోరారు. కేంద్రం నిధులను వెంకట్రామిరెడ్డి దుర్వినియోగం చేశారని, ఆస్తి పన్ను ఎగ్గొట్టారని తెలిపారు. సోదరులతో కలిసి వెంకట్రామిరెడ్డి అవినీతికి పాల్పడ్డారని బాలనరసింహారెడ్డి ఆరోపించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరారు. కాగా, అనంత వెంకట్రామిరెడ్డి ఇటీవలి ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ చేతిలో 23,023 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

# బేగంపేట్ ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు

**సికింద్రాబాద్ జూన్ 24 (ప్రజాస్వరం) :** బేగంపేట్ ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. బాంబు పెట్టినట్లుగా ఆగంతుకుల నుంచి మెయిల్ వచ్చినట్లుగా సమాచారం. అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయంతో పాటు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

# ఓయూలో ఉద్రిక్తత

### దీక్ష చేసేందుకు ప్రయత్నం.. విద్యార్థులు అరెస్ట్

**హైదరాబాద్ జూన్ 24, (ప్రజాస్వరం):** ఉస్మానియా యూనివర్సిటీలో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రూప్ 1 గ్రూప్ 2 పోస్టులు పెంచాలి. డీఎస్సీ ని వాయిదా వేసి మెగా డీఎస్సీ ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు దీక్షకు దిగారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని విద్యార్థులు హెచ్చరించారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను ఓయూ పీ ఎస్ కు తరలించారు.

# జూడాల స్ట్రైక్..

### గాంధీ, ఉస్మానియాల్లో విధులు బహిష్కరించిన డాక్టర్లు

### సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

**సికింద్రాబాద్, హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :** గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు అత్యవసర సేవలు మినహా అన్ని సేవలను నిలిపి వేసి నిరవధిక స్ట్రైక్ చేపట్టారు. గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించమంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధికార ప్రతినిధి డా. అజయ్ కుమార్ మాట్లాడుతూ పక్క రాష్ట్రంలో లాగా ఇక్కడ కూడా గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి రెగ్యులర్‌గా స్టై ఫండ్ ఇవ్వాలని, ప్రతి ప్రభుత్వ దవాఖానలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ కల్పించాలని, ఉస్మానియా హాస్పిటల్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లన్ని తమ కోసం మాత్రమే కాదని ప్రజల కోసం, భవిష్యత్ తరాల కోసమేనని ప్రజలు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.

**ఉస్మానియాలో...**

తమ సమస్యల పరిష్కారం కోసం ఉస్మానియా మెడికల్ కాలేజీలో జూడాలు ఆందోళన బాట పట్టారు. విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. గత ఆరు నెలలుగా తమకు స్టైఫండ్ సమయానికి రావడం లేదన్నారు. ఉస్మానియా హాస్పిటల్ నూతన భవనం నిర్మించాలని ఆరేళ్లుగా కోరుతున్నా... ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఉస్మానియా హాస్పిటల్ లో స్థలం లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, డాక్టర్లకు కూడా ఎలాంటి సౌకర్యాలు ఉండటం లేదని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు సీట్లు పెంచుతున్నారు కానీ హాస్టల్స్ పెంచడం లేదని... ఇరుకు గదుల్లో తాము ఉండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని... తరుచు వైద్యులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా నూతన భవనం తో పాటు , తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి , పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ సమ్మెను ఉధృతం చేస్తామని జూడాలు హెచ్చరించారు.

# నూతన లక్ష్యంతో ముదుకెళ్తాం

**న్యూ ఢిల్లీ, జూన్ 24 :** లోక్ సభ 2047 వికసిత్ భారత్ సంకల్పం, కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కొత్త పార్లమెంటు భవనంలో 18వ లోక్ సభ సమావేశాల సందర్భంగా మోదీ మాట్లాడారు. లోక్ సభ సభ్యులకు పీఎం మోదీ స్వాగతం పలికారు. ఇది చాలా పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు. 140 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరస్తామని, సామాన్య ప్రజల కలలు సాకారం చేస్తామని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మూడోసారి సేవచేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారని, సభ్యులందరినీ కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని మోదీవివరించారు. ప్రజలు మా విధానాలను విశ్వసించారని, సరికొత్త విశ్వాసంతో కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నామని, రాజ్యాంగానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నామని, రేపటితో అత్యయిక పరిస్థితి 50 ఏళ్లు పూర్తివుతుందని, అత్యయిక పరిస్థితి ఒక మచ్చ అని, 50 ఏళ్ల క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదని మోదీ తెలిపారు.

**ప్రమాణం చేసిన మోదీ, అమిత్ షా**

లోక్ సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. 18వ లోక్ సభ సమావేశంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు సోమ, మంగళవారాల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేయించారు. లోక్‌సభలో ఎంపీ ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రులు రాధామోహన్ సింగ్, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఫగ్గన్ సింగ్ కులస్తే, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, రామ్మోహన్ నాయుడు కింజారపు, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 543 మంది సభ్యుల్లో 280 మంది సభ్యులు కొత్తవారు ఉండగా 262 మంది గతంలో లోక్ సభలో సభ్యులుగా పని చేశారు. సభ్యుల ప్రమాణస్వీకారం అనంతరం ఎల్లుండి లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. వయనాడ్ స్థానానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామా చేశారని ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ తెలిపారు. రాహుల్ గాంధీ రాజీనామాను ఆమోదించామని ప్రొటెం స్పీకర్ వెల్లడించారు.

# అత్యాచార కేసులో రేవణ్ణ పెద్ద కొడుకు

బెంగళూరు, జూన్ 24 : మాజీ ప్రధాని దేవగౌడ కుటుంబాన్ని వరుస లైంగిక వేధింపుల కేసులు నిద్ర లేకుండా చేస్తున్నాయి. మాజీమంత్రి రేవణ్ణ చిన్నకొడుకు ఇప్పటికే లైంగిక వేధింపుల కేసులో కటకటాల్లో ఉంటే, ఆయన పెద్ద కొడుకు కూడా ఇలాంటి కేసులోనే అరెస్ట్ అయ్యాడు. అయితే పార్టీ కార్యకర్తపై అత్యాచారం చేసిన కేసులో అరెస్టయ్యారు సూరజ్ రేవణ్ణ. ఈ కేసును కేసును సీఐడీకి బదిలీచేసింది కర్నాటక ప్రభుత్వం. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణపై అసహజ లైంగికచర్య ఆరోపణలు వచ్చాయి. 27 ఏళ్ల జేడీఎస్ కార్యకర్తపై సూరజ్ లైంగికదాడికి సంబంధించి కేసు నమోదైంది. హసన్ జిల్లాలోని ఫామ్‌హౌస్‌లో ఈనెల 16న సూరజ్ రేవణ్ణ లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సూరజ్ రేవణ్ణని అరెస్ట్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను సూరజ్ రేవణ్ణ తోసిపుచ్చారు. 5 కోట్ల రూపాయలు ఇవ్వనందుకే ఆరోపణలు చేశాడని అంటున్నారు సూరజ్ రేవణ్ణ.సూరజ్ రేవణ్ణ తనపై లైంగికదాడి చేసినట్టు బాధితుడు స్వయంగా కర్నాటక డీజీపీకి ఫిర్యాదు చేశాడు. సూరజ్ రేవణ్ణ జేడీఎస్ తరపున ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2022లో హసన్ జిల్లా స్థానిక సంస్థల నుండి శాసనమండలికి ఎన్నికయ్యారు. అత్యాచారం కేసులో ఆయన్ను సీఐడీ అధికారులు లోతుగా విచారించారు. మహిళలపై అత్యాచారం కేసులో ఇప్పటికే జైలు పాలయ్యాడు ప్రజ్వల్ రేవణ్ణ. అశ్లీల వీడియో కేసులో నిందితుడైన ప్రజ్వల్ రేవణ్ణ దేశానికి తిరిగి వచ్చిన తర్వాత బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆ యువకుడిని సూరజ్ ట్రాప్ చేసినట్టు తెలుస్తోంది. ఫాంహౌస్‌లో అత్యాచారం చేసిన తరువాత ఆవిషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని కూడా బెదిరించినట్టు చెబుతున్నారు. అయితే తనపై ఆరోపణలను తీవ్రంగా ఖండించారు సూరజ్.

# ఎకరం.. 4 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించినట్టు తెలుస్తోంది. అదే విధంగా నివాస స్థలాల కనీస విలువ ప్రతి చదరపు గజానికి రూ.1,000, అపార్ట్ మెంట్ల కంపోజిట్ విలువ (చదరపు అడుగు) రూ.1,500గా ప్రతిపాదించాలని నిర్ణయించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చదరపు గజం కనీస విలువ రూ.500గా ప్రతిపాదించనున్నారు. ఈ మేరకు జరుగుతున్న కసరత్తు 90 శాతం పూర్తయిందని, సోమవారం సాయంత్రానికి రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సమర్పించున్నట్టు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రతిపాదనలపై ఈ నెల 25వ తేదీన ఆ శాఖ ఐజీ సమీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే ఆర్ సీసీ నిర్మాణాలు, రేకుల షెడ్లకు సంబంధించిన కనీస విలువల నిర్ధారణకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా వెలువడాల్సి ఉందని, ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

**మూడు కేటగిరీల్లో వ్యవసాయ భూముల విలువల సవరణ**

రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువను సవరించే ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల విలువలను మూడు కేటగిరీలుగా నిర్ధారించనున్నారు. గ్రామాల్లోని వ్యవసాయ భూములు (ఎక్కువ సర్వే నంబర్లలో ఇదే విలువ ఉంటుంది), రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన ఉండే వ్యవసాయ భూములు, వ్యవసాయేతర అవసరాలకు (వెంచర్లకు) వినియోగించేందుకు సిద్ధంగా ఉన్న భూములు..ఇలా మూడు కేటగిరీల్లో విలువలను నిర్ణయించనున్నారు. హైవేల పక్కన వ్యవసాయ భూముల విలువను రూ.40–50 లక్షల వరకు సవరించే అవకాశముందని, వ్యవసాయేతర అవసరాలకు సిద్ధంగా ఉన్న (ప్లాట్లుగా చేసేందుకు) భూమి విలువను రూ.కోటి వరకు సవరిస్తారని తెలుస్తోంది. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమీపంలో ఉన్న భూములకు, హైవేల పక్కనే ఉన్న నివాస ప్రాంతాలకు దూరంగా ఉండే భూములకు విలువల్లో తేడా ఉంటుందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ డివిజన్ సర్వే నంబర్లు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, హెచ్ ఎండీఏ, ఇతర నగర అభివృద్ధి సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ప్రాతిపదికన వ్యవసాయ భూములు, ఆస్తుల సవరణ ప్రక్రియ సాగుతోందని అంటున్నారు.



**తక్కువ ఉన్న చోట భారీగా..**

సవరణ ప్రక్రియకు రిజిస్ట్రేషన్ల శాఖ కొన్ని నిబంధనలను రూపొందించుకుంది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులు, నివాస స్థలాలకు సంబంధించి బహిరంగ మార్కెట్ లో ఉన్న విలువను ప్రాతిపదికగా తీసుకుంటోంది. బహిరంగ మార్కెట్ విలువకు, ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ విలువకు భారీగా వ్యత్యాసం ఉన్న చోట (ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువ తక్కువ ఉన్న ప్రాంతాల్లో) ఈసారి విలువలు భారీగా పెరగనున్నాయి. ఇందుకోసం రియల్ ఎస్టేట్ సంస్థల బ్రోచర్లు, ప్రకటనలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు రెవెన్యూ, మున్సిపల్ వర్గాల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు.

ఇలాంటి చోట్ల 40 నుంచి 100 శాతం విలువలు పెరగనున్నట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ విలువ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం ఓ మోస్తరు సవరణలుండే అవకాశముంది. ఈ ప్రాంతాల్లో కనిష్ఠంగా 10 నుంచి గరిష్ఠంగా 20 శాతం వరకు మాత్రమే విలువలు సవరించనున్నారు. మొత్తం మీద ఈ విలువల సవరణ ప్రక్రియ ఈ నెల 29వ తేదీతో పూర్తి కానుండగా, అదే రోజు క్షేత్రస్థాయి కమిటీలు ఆ విలువను నిర్ధారించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నాయి. ఆ తర్వాత ఈ విలువలను ప్రభుత్వ వెబ్ సైట్ లో అప్ లోడ్ చేసి ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం మరోమారు విలువల్లో మార్పులు, చేర్పులు చేసి ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలను అమల్లోకి తెచ్చేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సిద్ధమవుతోంది.


**వాణిజ్య ప్రాంతాలు మిస్ కాకుండా ప్రత్యేక దృష్టి**

తాజాగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రక్రియలో భాగంగా వాణిజ్య ప్రాంతాలపై రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. గతంలో సవరణ జరిగినప్పుడు అప్పటివరకు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టుగా నిర్ధారణ అయిన డోర్ నంబర్ల విలువలను మాత్రమే వాణిజ్య కేటగిరీలో పరిగణనలోకి తీసుకున్నారు. కానీ ఇప్పుడు వాణిజ్య డోర్ నంబర్లను ముందే ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. నగర, పట్టణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉండే వాణిజ్య సముదాయాలన్నింటికీ సంబంధించిన విలువల సవరణ ఆటోమేటిక్‌గా జరిగేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలోని ఏ ఒక్క కమర్షియల్ డోర్ నంబర్ తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని క్షేత్రస్థాయి కమిటీలకు వచ్చిన ఆదేశాల మేరకు చాలా పకడ్బందీగా వాణిజ్య ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ విలువల సవరణ జరుగుతోంది.

# పండుగలా పింఛన్ కార్యక్రమం

విజయవాడ, జూన్ 24 (ప్రజాస్వరం) :

ఏపీలో కొత్త ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ పై కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచుతూ ఫైల్ పై చంద్రబాబు సంతకం చేసిన సంగతి తెలిసింది. ఈనెల నుంచి నాలుగు వేల రూపాయల పింఛన్ లబ్ధిదారులకు అందం ఉంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఏప్రిల్ నుంచి ఈ పెంపుదల వర్తింపజేయనున్నారు. నాలుగు వేల రూపాయల పింఛన్ మొత్తం తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెల కు సంబంధించి పెండింగ్ మూడు వేల రూపాయలు అందించనున్నారు. మొత్తంగా కలిపి రూ.7000 పింఛన్ లబ్ధిదారులకు అందనుంది. అయితే వాలంటీర్లతో పంపిణీ చేయాలా? ప్రభుత్వ సిబ్బందితో అందించాలా? అన్నదానిపై చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో పింఛన్ల అంశం ప్రధాన హామీగా మారింది. రాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని 3,500 పెంచుతామని జగన్ హామీ ఇచ్చారు. అది కూడా రెండు విడతల్లో 250 చొప్పున పెంచుతామని చెప్పుకొచ్చారు. అయితే చంద్రబాబు మాత్రం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నాలుగు వేల రూపాయల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు. అది కూడా ఏప్రిల్ నుంచి మూడు నెలల పాటు పెండింగ్ మొత్తాన్ని కూడా జూలైలో చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి రావడంతో జూలై 1న పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచుతూ అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. కొత్త పింఛన్ పుస్తకాలతో పాటు నగదు అందించాలని ఆదేశించారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు ?4,000 పింఛన్ అందునుంది. అదేవిధంగా



ట్రాన్స్ జెండర్లు, గీత కార్మికులు, మత్స్యకార వర్గాలకు 4000 రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దివ్యాంగులకు మూడు వేల నుంచి 6 వేలకు, పూర్తిస్థాయి దివ్యాంగులకు ఐదు నుంచి 15 వేలకు పింఛన్ మొత్తాన్ని పెంచనున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి ఐదు వేల నుంచి పదివేలకు పింఛన్ మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల ఒకటి నుంచి ఈ పెంపుదల అమలు కానుంది. అయితే ఈ పింఛన్లను వాలంటీర్ల ద్వారా అందించాలా? లేకుంటే సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలా అన్నది ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈనెల 24న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనుంది. ఈనెల పెన్షన్లకు సంబంధించి ఎటువంటి నగదు సమస్య లేదని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. లై ఒకటో తేదీన ఇంటి వద్దనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తామని మంత్రి ఎస్.సవిత తెలిపారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు ఏ ఇబ్బంది కలగకూడదని భావించి ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేపడుతున్నామని ఏపీ బీసీ, చేనేత జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత చెప్పారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పెనుగొండ నియోజకవర్గానికి వచ్చిన టీడీపీ నాయకురాలు సవితకు పార్టీ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారుబెంగళూరు విమానాశ్రయం నుంచి వయా సోమందేపల్లి, పెనుగొండ పట్టణము వరకు 6 గంటల పాటు సుదీర్ఘంగా మంత్రి సవిత ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఏపీ మంత్రి సవిత మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలుపుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమంతో పాటు అభివృద్ధిపై నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చేనేతకు పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేనేత కార్మికుల బతుకుల్లో అభివృద్ధి వెలుగులు విరజిల్లుతాయన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, రాయితీ, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మంది పదవి ఇచ్చినందుకు చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు ఇచ్చిన బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి శాఖలలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ నియోజకవర్గంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేస్తానని, తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను అన్నారు. త్వరలో బిసి కమీషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్లలో వెనకబడిన తరగతుల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించే దస్త్రంపై తొలి సంతకం చేశామన్నారు

# మదనపల్లి రైతులకు మంచి రోజులు

తిరుపతి, జూన్ 24 (ప్రజాస్వరం) :

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టమోటా పంట ఎక్కువగా పండుతుంది. ఇక్కడ ఎర్రబంగారంగా పిలుచుకునే ఈ టమోటో పంటకు మదనపల్లి మార్కెట్ ఆసియా ఖండంలోనే అత్యధిక టమోటో ఉత్పత్తి చేసే మార్కెట్ గా పేరు సంపాదించింది. గత కొన్ని రోజులుగా టమోట ధరలు పెరిగి సామాన్యులకు భారంగా మారింది. గత ఏడాది మార్కెట్లో టమోటా ధర రూ.200 దాటడం తెలిసిందే. ఏ రాష్ట్రంలోనూ టమోటా అంతగా లేదు

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల టమోటో పంట సాగు చేస్తున్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే పశ్చిమ ప్రాంతమైన మదనపల్లి సమీపంలోని మండలాల్లో అత్యధికంగా టమోటా పడ్డ సాగుతుంది. గత ఏడాది జూన్ నెలలో 14 వేల క్వింటాళ్ల సరుకు మదనపల్లి మార్కెట్ నుంచి వెల్లింది. ఈ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో టమోటో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని మార్కెట్ కమిటీలు సైతం టమోట మార్కెట్లు నిర్వహిస్తోంది అంటే ఏంత మేర పంట సాగవుతుందో అర్థమవుతోంది. నైరుతి రుతుపవనాల రాకతో దక్షిణాదిన పలు రాష్ట్రాలలో వర్షాలు ప్రారంభమయ్యాయి. వర్షాలు పడ్డాయని సంతోషించే లోపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంట నీటిపాలు అయ్యింది. అనుకోని విధంగా తెల్ల పురుగు వైరస్ సోకి పంట దిగుబడి తగ్గిపోయింది. గాలుల ప్రభావం తో పంట నేలపాలు కాగా వర్షం నీటిలో పడి అవి పాడైపోయి పంట నష్టం వాటిల్లింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా టమోట రైతులకు మాత్రం వర్షా కాలం తక్కువ వర్షాలు కురవడం అదృష్టంగా చెపొచ్చు. పలు రాష్ట్రాల్లో టమోటో ఉత్పత్తి తగ్గడంతో జిల్లాలోని టమోటా రైతుల



పంటకు మంచి ధర వస్తుంది. ఇక్కడ కూడా పంట దిగుబడి తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే జూన్ వరకు 5 నుంచి 7వేల మెట్రిక్ టన్నుల సరుకు మాత్రమే మదనపల్లి మార్కెట్ కు వచ్చింది. కొన్ని సంవత్సరాల కాలంగా టమోటో సాగు చేస్తున్న రైతులు తక్కువ ధర.. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో రోడ్డుపై పారవేసి ఆత్మహత్యలకు పూనుకున్న పరిస్థితుల నుంచి ప్రస్తుతం లాభాల బాటకు రైతులు వెళు తున్నారు. అయితే గతంలో నష్టపోయిన పరిస్థితి నుంచి అప్పులు తీర్చుకోవడానికి మాత్రమే ఈ టమోటా అధిక ధర ఉపయోగపడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే త్వరలో కొత్త పంట చేతికి అంది వచ్చే అవకాశం ఉన్న క్రమంలో రైతుల మద్దతు ధరను కేటాయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని మాత్రం రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ గా మదనపల్లె టమోటా మార్కెట్ గుర్తింపు పొందింది. మదనపల్లె మార్కెట్ నుంచి ఆశా ఖండంలోని వివిధ దేశాలకు టమోటా ఎగువతులు జరుగుతుంటాయి. ఇతర దేశాలు రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, దళారుల ఇష్టానుసారం ధరలు పెంచి అక్కడ మరింత అధిక రేట్లు అమ్ముకునే విధంగా ఇక్కడ కొనుగోలు చేస్తున్నారు. అదే కారణంతో రాష్ట్రం వ్యాప్తంగా టమోటా ధరలు అత్యధికంగా పెరిగాయి. రాష్ట్రంలో ప్రస్తుతం మార్కెట్ ధర 100 నుంచి 120 వరకు పెరగగా, మార్కెట్ ధరతో పాటు దళారి వ్యవస్థ తీవ్రంగా రైతుల పాలిట శాపంగా మారింది. రైతులకు గిట్టుబాటు ధర మాత్రమే అందిస్తూ వారి కడుపు కొడుతున్నారు. ప్రస్తుతం 25 కేజీల టమోటో బాక్సు 2200 నుంచి 2500 వరకు పంట దిగుబడి బట్టి వేలంలో పాడుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కాకుండా తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్ గఢ్, ఒరిస్సా, బిహార్, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, బాంగ్లాదేశ్, బొంబాయి ఇలా ఇతర దేశాలకు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. జూలై రెండో వారం వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం కనబడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్లో టమోట ధరలు మండిపోతున్నాయి. కొన్ని చోట్ల కిలో 80 నుంచి 100 పలుకుతుంది. పంట దిగుబడి తగ్గి ధరలు పెరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందించే సబ్సిడి ధరకు విక్రయాలు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ కు ఆదేశాలు జారీ చేసింది. అదే తడవుగా రాష్ట్రంలోని రైతు బజార్లకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి టమోట పంటను రూ. 55 నుంచి 60 లోపు కొనుగోలు చేసి పంపారు. పది రోజుల్లో 30 టన్నుల టమోటలను కొని కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు పంపిణీ చేస్తారు. ఈ ప్రక్రియ కోసం ప్రతి జిల్లాకు ఐదు లక్షలు రూపాయలు రివర్స్ఇన్ ఫన్ ఇవ్వబోతున్నారు. చాల జిల్లాలకు ఈ పంట చేరుకున్న ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో సబ్సిడీ పంట ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీని పై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని నూతన ప్రభుత్వానికి ప్రజల నుంచి డిమాండ్ వినిపిస్తోంది

# డిప్యూటీ స్పీకర్ బరిలో ఎవరు

విజయవాడ, జూన్ 24 (ప్రజాస్వరం) :

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. అసెంబ్లీ సమావేశాల తొలి రోజు కండువాలతో వచ్చిన సభ్యులతో సభ కళకళలాడింది. ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకే నామినేషన్ రావడంతో అయ్యన్నపాత్రుడి ఎన్నిక ఏకగ్రీవమైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎమ్మెల్యేను స్పీకర్‌గా ప్రకటించారు అధికారులు. అయ్యన్న.. సభలో ఉన్న కూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత సీనియర్. ఇప్పటి వరకు 7 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఒకసారి అనకాపల్లి ఎంపీగానూ విజయం సాధించారు. పలు శాఖలకు మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. డిప్యూటీ స్పీకర్ పదవి ఎవరికి దక్కబోతుందన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది. స్పీకర్ చైర్ టీడీపీకి దక్కింది, డిప్యూటీ స్పీకర్ పదవి మిత్రపక్షాలకు ఇస్తారా అన్న చర్చ నడుస్తోంది. దీనిపై కూటమి పార్టీల మధ్య పెద్ద ఎత్తున డిస్కషన్ సాగుతోంది. ఇక్కడ కొన్ని సమీకరణాలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడికి స్పీకర్ పదవి దక్కింది. రాయదర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులుకు డిప్యూటీ దక్కే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. కాల్వ కూడా టీడీపీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉంది. రెండు పదవులు బీసీలకు ఇవ్వడం ద్వారా కూటమి బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందనే సంకేతాలు తీసుకెళ్లేలా అధినేతలు కసరత్తు చేస్తున్నారు. లేదంటే జనసేన కూడా దక్కే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంలో మూడు పార్టీల మధ్య చర్చలు నడుస్తున్నాయి. జనసేనకు ఇస్తే ఓసీ సామాజిక వర్గానికి చెందిన నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవికి ఇస్తారనేది టాక్. దీనికి మించి మరో లెక్క కూడా లేకపోలేదు. స్పీకర్, డిప్యూటీ ఒకే ప్రాంతానికి చెందిన వారికి రెండు పదవులు ఇవ్వకుండా వేరు వేరు ప్రాంతాలకు ఇవ్వడం ద్వారా అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందని అధినేతలు లెక్కలు వేస్తున్నారు. ఇక పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకు చీఫ్ విప్ దక్కే అవకాశం ఉన్నట్లు సభ్యుల మధ్య చర్చ నడుస్తోంది. తొలిరోజు సభలో 171 మందితో ప్రమాణం చేయించారు ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యచౌదరి. వ్యక్తిగత కారణాలతో ప్రమాణం చేయని ముగ్గురు ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, పితాని సత్యనారాయణ, వనమాడి వెంకటేశ్వరరావు రెండో రోజు సభలో ప్రమాణం చేస్తారు. సభ్యుల ప్రమాణం తర్వాత సభలో స్పీకర్ పేరు ప్రకటిస్తారు. తొలి రోజు సభలో ఉద్విగ్న క్షణాలు కనిపించాయి. బాలకృష్ణతో కలిసి వచ్చిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీ మెట్లపై ప్రణమిల్లారు. రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీలో చంద్రబాబు అడుగుపెట్టారు. డిప్యూటీ




సీఎం పవన్, మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎంకు స్వాగతం పలికారు. అంతకు ముందు ఉండవల్లి నివాసం నుంచి బయల్దేరిన చంద్రబాబు.. వెంకటపాలెంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యేలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసెంబ్లీ హాల్‌లో అడుగుపెట్టిన చంద్రబాబు-పవన్ ఆలింగనం చేసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సీఎం చంద్రబాబుతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం స్వీకారం చేయించారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. నారాలోకేష్‌తోపాటు మిగతా మంత్రులు ప్రమాణం చేశారు. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన వైఎస్ జగన్.. ప్రొటెం స్పీకర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# అసెంబ్లీకి హాజరు కాకపోతే అనర్హతకు చాన్స్

విజయవాడ, జూన్ 24 (ప్రజాస్వరం) :

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఊహించని మలుపులు తిరిగాయి. ఓడలు బండ్లు అయ్యాయి. బండ్లు ఓడలయ్యాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రధాన ప్రతిపక్ష హోదాకు దూరమయింది. పూలమ్మిన చోట రాళ్లమ్మడం ఎలా అని జగన్ అనుకుంటున్నారేమో కానీ అసెంబ్లీ వైపు రావాలని ఆయన అనుకోవడం లేదు. ప్రమాణ స్వీకారం తప్పనిసరి కాబట్టి ఆ తంతు పూర్తి చేసి పది నిమిషాలు కూడా అసెంబ్లీలో ఉండకుండా వెళ్లిపోయారు. స్పీకర్ ఎన్నికలకు తాను దుమ్మా కొట్టారు. తన పార్టీ సభ్యులను కూడా వెళ్లనీయలేదు. ఇటీవల పార్టీ కార్యకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలను బట్టి చూస్తే భవిష్యత్ లో కూడా అసెంబ్లీకి హాజరయ్యే అవకాశాలు లేవని ఎక్కువ మంది నమ్ముతున్నారు. గతంలో అలా అసెంబ్లీని బహిష్కరించిన ట్రాక్ రికార్డు జగన్‌కు ఉండటమే దీనికి కారణం. ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా అసెంబ్లీకి వచ్చేందుకు జగన్ సిద్ధంగా లేరు. ముఖ్యంగా అయ్యన్న పాత్రుడు స్పీకర్ గా ఉన్నారు. ఆయనను అధ్యక్షా అని సంబోధించేందుకు జగన్ మనస్థత్వం అంగీకరించని వైఎస్ఆర్‌సీపీ నేతలే చెబుతూంటారు. అలాగే అసెంబ్లీలో పవన్ కల్యాణ్, రఘురామకృష్ణరాజు వంటి వాళ్లు ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి తన రాజకీయాన్ని వ్యక్తిగతంగా.. రాజకీయంగా చూడరు. మొత్తం ఒకటే అనుకుంటారు. రాజకీయ ప్రత్యర్థులు వ్యక్తిగత శత్రువులుగానే చూస్తారు. పార్టీ, ప్రభుత్వం ఒకటే అని అధికారంలో ఉన్నప్పుడు అనుకునేవారు. అలా.. ఇతర పార్టీల నేతలతో రాజకీయంగా ఓ సంబంధం.. వ్యక్తిగతంగా మరో సంబంధం ఉండదని.. మొత్తం ఒకటేనని నమ్ముతారు. అందుకే తన రాజకీయ ప్రత్యర్థుల్ని శత్రువులుగానే పరిగణించి.. ఎక్స్‌ట్రీమ్ ఎటాక్ చేస్తారు. దాని వల్ల ఆయనకు రాజకీయంగానే కాదు వ్యక్తిగతంగానూ అందరూ శత్రువులుగానే కనిపిస్తున్నారు. గత అసెంబ్లీలో వైసీపీ సభ్యులు .. టీడీపీ సభ్యులకు చేసిన అవమానాలకు ఖచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటారని దాని వల్ల జగన్ పైనే ఎక్కువగా ఎటాక్ చేస్తారని అనుకుంటున్నారు. ఈ పరిస్థితుల్ని ఎదుర్కోవడం కన్నా.. అసెంబ్లీకి దుమ్మా కొట్టడమే మంచిదని జగన్ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఇలాంటి కౌరవ సభలో మనం ఏదో మాట్లాడుతామని.. పోరాటం చేస్తామని నాకైతే నమ్మకం లేదు అని జగన్ నేరుగా పార్టీ కార్యవర్గ సమావేశంలో చెప్పారు. అంటే ఎమ్మెల్యేలు కూడా హాజరవకూడదని ఆయన ఉద్దేశం అనుకోవచ్చు. జగన్ కు గతంలోనూ అసెంబ్లీని బహిష్కరించిన రికార్డు ఉంది. 2017లో పాదయాత్ర ప్రారంభించే ముందు అసెంబ్లీని బహిష్కరించారు. తన పార్టీ ఎమ్మెల్యేలను కూడా ఆయన అసెంబ్లీకి వెళ్లడానికి అంగీకరించలేదు. నాలుగు సెషన్ల పాటు ఈ బహిష్కరణ సాగింది. అప్పట్లో టీడీపీ మాత్రమే అసెంబ్లీని నిర్వహించింది. టీడీపీ సభ్యులే ప్రతిపక్ష పాత్ర కూడా పోషించారు. జగన్ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గలేదు. గతంలో తమిళనాడులో జయలలిత, ఉమ్మడి ఏపీలో ఎన్టీఆర్ అసెంబ్లీలను బహిష్కరించారు కానీ.. వారి ఎమ్మెల్యేలు మాత్రం సభకు వెళ్లారు. చంద్రబాబునాయుడు కూడా అసెంబ్లీని బహిష్కరించి శపథం చేసి వచ్చేశారు కానీ.. టీడీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం తాను వెళ్లకపోతే ఎమ్మెల్యేలు కూడా వెళ్లాల్సిన అవసరం లేదనుకుంటారు. అందుకే ఎమ్మెల్యేలతో కూడా సమావేశాలను బహిష్కరింప చేసే అవకాశాలను కొట్టి పారేయలేమని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసినా వరుసగా మూడు సెషన్లకు స్పీకర్ అనుమతి తీసుకోకుండా దుమ్మా కొడితే.. అనర్హతా వేటు వేసేందుకు స్పీకర్‌కు సర్వాధికారాలు ఉంటాయి. సెలవు పెట్టకుండా అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు వేయడం..నియమాలు, సంప్రదాయాలకు సంబంధించినదని. వరుసగా మూడు సెషన్లకు రాకపోతే అనర్హతా వేటు వేయవచ్చని నిబంధనలు చెబ్బుతున్నాయి. యితే ఇంత వరకూ దేశంలో.. ఇలాంటి ఘటన జరగలేదు. సభకు హాజరు కాకపోతే స్పీకర్ దగ్గర అనుమతి తీసుకుంటే అనర్హతా వేటు నుంచి తప్పించుకోవచ్చు. అయితే వైసీపీ సభ్యులు బహిష్కరించాలనుకుంటే.. తమకు సెలవు కావాలని దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండదు. దరఖాస్తు చేసుకుంటే ఇస్తారు కానీ దాని వల్ల రాజకీయంగా అనేక విమర్శలు వస్తాయి. అసెంబ్లీ సెషన్స్ రాకపోతే.. నిబంధనల ప్రకారం అనర్హతా వేటు వేసే అవకాశం వస్తే.. టీడీపీ ఖచ్చితంగా ఉపయోగించుకుంటుందన్న అంచనాలు ఉన్నాయి. అసెంబ్లీకి హాజరు కాకపోవడం ద్వారా స్పీకర్ అనర్హతా వేటు వేస్తే.. ఆ నిర్ణయాన్ని కోర్టుల్లో కూడా సవాల్ చేయలేరు. శాసన వ్యవస్థకు సంబంధించి స్పీకర్ అత్యంత పవర్ ఫుల్ . ఆయన నిర్ణయమే ఫైనల్. ఒక వేల ఇలాంటి పరిస్థితి తెచ్చుకుని వైసీపీ ఎమ్మెల్యేలు ఉపన్నికలు తెచ్చుకుంటే పులివెందులలోనూ గడ్డు పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావొచ్చు. అధికారంలో ఉన్న పార్టీకి సహజంగా ఉపఎన్నికలు అనుకూలంగా ఉంటాయి. బీటెక్ రవి లాంటి గట్టి ప్రత్యర్థి కూడా ఉన్నందున అలాంటి పరిస్థితి తెచ్చుకోవడం జగన్మోహన్ రెడ్డికి రిస్కే అన్న అభిప్రాయం ఉంది. అందకే వైసీపీ సభ్యులు అన్నీ ఆలోచించుకుని అసెంబ్లీకి రావడంపై నిర్ణయం తీసుకుంటారని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. వచ్చే నెలలోనే ఈ అసెంబ్లీ మొదటి సెషన్ జరిగే అవకాశం ఉంది.

## ప్రైవేటు బస్సు బోల్తా.. పయాణికులకు గాయాలు

రంగారెడ్డి, జూన్ 24 (ప్రజాస్వరం) :

నార్సింగీ ఔటర్ రింగు రోడ్డు పై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఘటనలో ఇద్దరు బస్సు చక్రాల కింద నలిగారు. బస్సులో ప్రయాణిస్తున్న పలువురు కి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో 2 కిలోమీటర్ల మేరా ట్రాఫిక్ జామ్ అయింది. హైదరాబాద్ నుండి ఔటర్ రింగు రోడ్డు మీదుగా ముంబాయి వెళుతున్న మార్నింగ్ స్టార్ బస్సు ప్రమాదానికి గురయింది. బస్సులో పలు కుటుంబాలు వున్నాయి.

## పాన్ షాపులు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :

సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్ షాపు .ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు. హోటళ్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. నిషేధిత గాంజా, గుట్కా అమ్మకాలపై కఠిన చర్యల నేపథ్యంలో సైదాబాద్ సి ఐ రాఘవేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్న, ఇతరులకు విక్రయించిన చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అక్రమాల గూడెం...

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :

మోదీ వస్తే ఈడీ వస్తుంది.. ఎన్నికల సమయంలోనే ఈడీ దాడులు చేస్తుంది.. విపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తుంది.. ఇదీ ఆరునెలల క్రితం వరకు బీఆర్ఎస్ నేతలు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐపై, కేంద్రంపై చేసిన ఆరోపణలు. కానీ ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యాయి. మోదీ రాష్ట్రానికి రాలేదు.. కానీ ఈడీ వచ్చింది. కారణం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి మైనింగ్ పేరుతో చేసిన అక్రమాల గుట్టు తేల్చబోతోంది. అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వానికి రూ.39 కోట్ల నష్టం నష్టం కలిగించారు. ఈ లెక్క తేల్చేందుకు ఈడీ మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు బంధువుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసింది.ఇక మొదట రూ.39 కోట్ల అక్రమాలు జరిగాయని ఈడీ భావించగా, దాడుల తర్వాత ఈడీకి దిమ్మ తిరిగి బొమ్మ కనిపించింది. పత్రాలు, కంప్యూటర్లు, రికార్డులు పరిశీలించిన తర్వాత రూ.300 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు ఈడీ అధికారులు అధికారికంగా వెల్లడించారు. సంతోష్ సాండ్, సంతోష్ గ్రానైట్ కంపెనీల ద్వారా ఈ అక్రమాలు కొనసాగించారని ఈడీ పేర్కొంది. ఇక ఈడీ దాడుల సమయంలో రూ.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దాడుల వివరాలతో ఈడీ అధికారిక ప్రకటన విడుదల చేసింది.మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మనీ లాండరింగ్, హవాలా మార్గాల్లో అక్రమాలకు పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు దాడులు చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల్లో కూడా అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అక్రమ మార్గంలో పెద్దమొత్తంలో డబ్బును స్థిరాస్తి రంగంలో పెట్టుబడి పెట్టినట్లు ఈడీ వెల్లడించింది. ఇంకా కొన్ని బ్యాంకు లాకర్లు తెరవాల్సి ఉందని తెలిపింది.ఇక గుడెం బ్రదర్స్ అక్రమ దందాలను బినామీల పేరిట చేసినట్లు ఈడీ గుర్తించింది. వారి వివరాలు సేకరించే పనిలో కూడా ఈడీ ఉంది. తమ పేర్లు బయటకు రాకుండా ఉండేందుకే పలువురు బినామీల పేరిట వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. బినామీల ఖాతాలు, ఇళ్లలోనూ సోదాలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఇదిలా ఉంటే.. గూడెం సోదరులను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు వెనకేసుకొచ్చారు. తమ ఎమ్మెల్యే ఎలాంటి తప్పు చేయలేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. ఈడీ కక్షపూరితంగా దాడులు చేస్తోందని ఆరోపించారు. ఐటీ చెల్లిస్తూనే వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించారు. కానీ, ఈడీ అధికారికంగా పట్టుకున్న డబ్బులు, గుర్తించిన అక్రమాల వివరాలను వెల్లడించింది. అయినా హరీశ్‌రావు తమ ఎమ్మెల్యేను వెనకేసుకురావడం గమనార్హం.


## మారనున్న కర్నూలు కార్పొరేషన్ రాజకీయాలు

కర్నూలు, జూన్ 24 (ప్రజాస్వరం) :

కర్నూలు నగర మేయర్ అతి ప్రధానమైనది. నగర అభివృద్ధి చెందాలంటే నగర పాలక సంస్థపై పెత్తనం ఉండాల్సిందే. ప్రస్తుతం నగర మేయర్ గా వైసీపీకి పూర్తిస్థాయి మెజారిటీ ఉంది. మొత్తం 52 డివిజన్లకు గానూ 9 మినహా అన్నింటిలోనూ వైసీపీదే విజయం. 19వ వార్డు నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన రామయ్య మేయర్‌గా కొనసాగుతున్నారు. ముఖ్యమైన పనులు చేసి తనదైన ముద్ర వేసుకున్నారు. పార్కులు అభివృద్ధి చేయడం మురికి కాలువలు శుభ్రం చేయడం, తాగునీటి సమస్య తీర్చడం అలాంటి పనులు చేయడమే కాకుండా నగరమంతా పరిశుభ్రంగా పచ్చదనంగా ఉండడంలో తనదైన ముద్ర వేసుకున్నారు రామయ్య. డిప్యూటీ మేయర్ గా సిద్ధారెడ్డి రేణుక వ్యవహరిస్తున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ మారి టీడీపీకి అధికారం దక్కింది. జిల్లాలో ఎమ్మెల్యేలు కూడా ఆ పార్టీ వారే గెలుపొందారు. కర్నూలు ఎమ్మెల్యేగా టీజీ భరత్ గెలవడమే కాకుండా కేబినెట్‌లో మంత్రి పదవి దక్కించుకున్నారు. మంత్రి మొదటిసారిగా నగరానికి వచ్చిన వెంటనే నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షించారు. దీనిని బట్టి చూస్తే కచ్చితంగా నగరపాలక సంస్థపై పట్టు సాధించేందుకు టీడీపీ ముఖ్యంగా టీజీ భరత్ ప్రాధాన్యత ఇస్తున్నారనే విషయం స్పష్టం అవుతుంది. ప్రారంభంలో 52 మంది కార్పొరేటర్లలో టీడీపీకి 9, వైసీపీకి 43 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఎన్నికలకు ముందే 17, 22 డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఫలితాల తర్వాత 3,4,6,13 డివిజన్లకు చెందిన వైసీపీ కార్పొరేటర్లు తెలుగుదేశంలో చేరిపోయారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే మరో ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు ఆపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ప్రస్తుతం టీడీపీ కార్పొరేటర్ల సంఖ్య 18 కి చేరుకుంది. మరో 11 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం ఊపందుకుంది.ప్రస్తుతం కర్నూలు నగరంలో కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాలకు చెందిన కార్పొరేటర్లు ఉన్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలంతా టీడీపీ నుంచి గెలుపొందిన వారే. ఎంపీ కూడా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. టీడీపీ అన్ని విధాల పట్టు సాధిస్తున్నది అనే దానికి ఇదే నిదర్శనం. అవిశ్వాసం పెట్టాలంటే సగానికి పైగా మెజారిటీ ఉండాలి. జూన్ 19న పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 13 మంది కార్పొరేటర్లు ఒక హోటల్‌లో రహస్యంగా సమావేశం అయ్యారని, కలిసికట్టుగా ఉంటే పనులు చేసుకోవచ్చని తీర్మానించినట్లు ప్రచారం జరుగుతోంది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పట్ల విశ్వాసం విధేయత చూపాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతుంది.కోడుమూరు కర్నూలు అసెంబ్లీ పరిధిలోని కార్పొరేటర్లు సైతం కొందరు టీడీపీ వైపు చూస్తున్నారని ప్రచారం జరుగుతుంది. ఇదే గనుక జరిగితే త్వరలోనే కర్నూలు మేయర్ పీఠంపై మార్పులు జరగవచ్చని ప్రచారం జరుగుతోంది. దీనిని కర్నూలు మేయర్ రామయ్య ఖండిస్తున్నారు. నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదని, చట్ట ప్రకారం నాలుగేళ్ల వరకు మేయర్ ని దించేందుకు వీలు లేదని తన అనుచరుల వద్ద రామయ్య అన్నట్లు తెలుస్తోంది. తప్పులను భూతద్దంలో వెతికి ఏదో విధంగా దారికి తెచ్చుకునే ప్రయత్నం టీడీపీ చేస్తుందనే వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.మరోవైపు నగరపాలక సంస్థను తన చేతుల్లో ఉంచుకునేందుకు మంత్రి టీజీ భరత్ సిగ్నల్ ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతుంది. కార్పొరేటర్లు చేజారిపోకుండా ఉండేందుకు వైసీపీ నేతలు లోలోపల ప్రయత్నాలు సాగిస్తున్నారట. అయినా అధికారంలో ఒక పార్టీ కార్పొరేటర్లు మరో పార్టీ అయితే వ్యక్తిగతంగా, కార్పొరేషన్ పరంగా అభివృద్ధికి అడ్డంగా ఉంటుందని టీడీపీ నేతలు కార్పొరేటర్లకు చెప్పినట్లు సమాచారం. దీంతో రానున్న రోజుల్లో కర్నూలు మేయర్ పీఠంపై మార్పులు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.కర్నూలు కార్పొరేషన్ తో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ మున్సిపాలిటీలతోపాటు గూడూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, బేతంచెర్ల తదితర నగర పంచాయతీలలో కూడా మార్పు తేవాలని అధికారం మార్చాలని టీడీపీ ముఖ్యులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రులు జిల్లాకు రాగానే దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటారని సమాచారం. నగర పురపాలక పెత్తనం పోకుండా చేసుకునేందుకు వైసీపీ ఎలాంటి వ్యూహం చేయనుంది అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది..!

# కుప్పం పై చంద్రబాబు దృష్టి

తిరుపతి, జూన్ 24 (ప్రజాస్వరం) :




ఏపీ అసెంబ్లీలో చిట్ట చివరి నియోజకవర్గం కుప్పం. 1989 వరకు బాగా వెనుకబడినప్పటికీ.. సీఎం చంద్రబాబు వరుస విజయాలతో ఆ ప్రాంత అభివృద్ధి దశ తిరిగింది. కుప్పం నుంచి వరుసగా 8వ సారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు 4వ సారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. సీఎంగా చంద్రబాబు ఉన్నంత కాలం ప్రతి ప్రాజెక్టు, స్కీం ను ప్రయోగాత్మకంగా ప్రారంభించేందుకు కుప్పం వేదిక అవుతూ వచ్చింది. సీఎం చంద్రబాబు కూడా సొంత నియోజకవర్గానికి హై ప్రియారిటీ ఇస్తూ వచ్చారు. అయితే 2019లో అధికారాన్ని కోల్పోయిన చంద్రబాబు ప్రతిపక్ష నేతగా కుప్పం అభివృద్ధిని చూడలేక పోయారు. కుప్పం ప్రజలకు ఇచ్చిన హామీలు తీర్చలేకపోయారు. ఇందుకు కుప్పంపై వైసీపీ ప్రభుత్వం వివక్షనే కారణమంటూ ఐదేళ్లుగా ఆరోపిస్తూ వచ్చారు. చంద్రబాబు సొంత ఇలాకాలో ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు.. పలు ప్రాజెక్టులను పూర్తి చేయడమే టార్గెట్?గా చేసుకోబోతున్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పంకు తీసుకొచ్చేందుకు బ్రాంచ్ కెనాల్ నిర్మాణ పనులను చేపట్టి దాదాపు 85 శాతం వరకు పనులను పూర్తి చేశారు. అయితే ఈలోపు అధికారం చంద్రబాబు చేజారి పోగా వైసీపీ సర్కార్ హంద్రీనీవాను పూర్తి చేయలేక పోయింది. అయితే కుప్పంకు హంద్రీనీవా నీటిని తీసుకొచ్చామని చెప్పే ప్రయత్నం వైసీపీ చేసిందని టిడిపి ఆరోపించింది.ఎన్నికలకు ముందు హంద్రీనీవా నీటిని కుప్పంకు విడుదల చేస్తున్నట్లు హడావిడి చేసినా నీళ్లు మాత్రం కుప్పంకు రాకపోవడంతో ఇప్పుడు ఆ ప్రాజెక్ట్ చంద్రబాబు సర్కార్?కు అత్యంత ముఖ్యం అయింది. దీంతో గత ఐదేళ్లుగా హంద్రీనీవా కాలువ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలిస్తూ వచ్చారు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు. హంద్రీనీవాను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నారు. ఇక రామకుప్పం మండలం ననియాల వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టును చేపట్టిన సీఎం చంద్రబాబు 2019 నాటికి దాదాపు పూర్తి చేశారు. అయితే గత 5 ఏళ్లలో టూరిజం పర్యాటకులకు అందుబాటులోకి రాకపోగా ఇప్పుడు 5 ఏళ్ల తర్వాత దాన్ని తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు సరిహద్దులో ఎకో టూరిజం ప్రాజెక్టును పూర్తి చేసి పర్యాటక రంగ అభివృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు భావించారు. శిక్షణ పొందిన ఏనుగులున్న ననియాల ఎలిఫెంట్ క్యాంప్?లో పర్యాటకులను ఆకట్టుకునేలా అంబారీ స్వారీ, విలాసవంతమైన కాటేజీలు, రిసార్టు, హెలిప్యాడ్ నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే ఆ ప్రాజెక్టు గత ఐదేళ్లపాటు నిరుపేయంగానే ఉండి పోవడంతో ఇప్పుడు సీఎం చంద్రబాబు కుప్పం అభివృద్ధిపై చేస్తున్నారు.మరోవైపు కుప్పంలో రహదారుల విస్తరణ, పాలార్ ప్రాజెక్టు కీలకంగా మారింది. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల మధ్య గత కొన్ని దశాబ్దాలుగా అంతరాష్ట్ర సమస్యగా మారిన పాలారు ప్రాజెక్టు పనులకు గత ప్రభుత్వం పాలన అనుమతులను ఇచ్చింది. దాదాపు రూ.140 కోట్లు నిధులు విడుదలకు అనుమతించింది. అయితే పనులు మాత్రం చేపట్టక పోగా కుప్పం మండలం గణేష్ పురం వద్ద పాలారు ప్రాజెక్ట్ పనులు చేపట్టి పూర్తి చేయడం ఇప్పుడు టిడిపి సర్కార్ వంతు అయింది. కుప్పం %-% బెంగళూరు మధ్య కనెక్టివిటీ పెంచి శాటిలైట్ సిటీగా మార్చే దిశగా ప్రణాళిక రూపొందించారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు తొలి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. మరోవైపు రామకుప్ప మండలంలో ఏయిర్ పోర్ట్ నిర్మాణానికి భూసేకరణ జరిపినా 2019లో రాష్ట్రంలో అధికారం మారిపోవడంతో ఆ పనులు ముందుకు జరగలేదు. అయితే ఇప్పుడు తిరిగి చంద్రబాబు సీఎం కావడంతో రామకుప్పం శాంతిపురం మండలాల మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులకు లైన్ క్లియర్ అయ్యిందని భావిస్తున్నారు స్థానికులు. ఈ మేరకు త్వరలో నిర్మాణ పనులు కూడా షురూ కానున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 25, 26 రెండు రోజులు సీఎంగా చంద్రబాబు కుప్పం పర్యటన చేపట్టబోతున్నారు. ఒక వైపు అభివృద్ధి పనులకే కాకుండా పార్టీ బలోపేతం పట్ల చంద్రబాబు ఫోకస్ పెడుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీ టార్గెట్?గా పెట్టుకున్న చంద్రబాబుకు ఎందుకంత మెజార్టీ రాలేకపోయిందో అన్నదానిపై కూడా ఫోకస్ చేయబోతున్నారు.

# ఏపీలో రీవెంజ్ పాలిటిక్స్...

గుంటూరు, జూన్ 24 (ప్రజాస్వరం) :

ఏపీలో రివేంజ్ పాలిటిక్స్‌కు అడుగు పడిందా? లేక చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందా? సమయం తెల్లవారుజామున 5 గంటల 30 నిమిషాలు.. తాడేపల్లిలోని వైసీపీ అధినేత జగన్ క్యాంప్ కార్యాలయానికి కూతవేటు దూరంలో మొదలయ్యాయి కూల్చివేతలు. కూలిపోయేది నిర్మాణంలో ఉన్న వైసీపీ పార్టీ కార్యాలయం.. తూర్పున సూర్యుడు ఉదయించేలోపే జరగాల్సినదంతా జరిగిపోయింది. నిర్మాణంలో ఉన్న కార్యాలయం నేలమట్టమైంది. ఇక ఆ తర్వాత మొదలైంది అసలు రాజకీయం. రాజకీయాల గురించి మాట్లాడుకునేముందు అసలు ఆ నిర్మాణాలు ఎందుకు కూల్చారో తెలుసుకుందాం.. తాడేపల్లిలోని 202/%ఉా%1 సర్వే నంబర్‌లో ఉంది ఈ నిర్మాణం. ఈ సర్వే నంబర్‌లో 2 ఎకరాల భూమిని పార్టీ కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించింది. అంటే వైసీపీ హయాంలో.. వారి పార్టీ కోసం కేటాయించిన స్థలం. అయితే ఈ స్థలం అంతకుముందు ఇరిగేషన్ శాఖ స్వాధీనంలో ఉంది. అయితే ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇరిగేషన్ శాఖ అంగీకరించలేదు. సీఆర్డీఏ, %మీవీజు%, రెవెన్యూశాఖలు కూడా ఈ భూమిని ఆ పార్టీకి అంగీకరించలేదు. అంతేకాదు అసలు భవన నిర్మాణానికి కనీసం ప్లాన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోలేదు. నీటిపారుదలశాఖకు చెందిన భూమిలో ఇలా అక్రమంగా, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధం. అందుకే ముందుగా నోటీసులు ఇచ్చాం.. ఆ తర్వాత కూల్చేశాం.. ఇది ప్రభుత్వాధికారులుచెబుతున్న మాట.అయితే వైసీపీ ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ కార్యాలయ నిర్మాణం చేపట్టిందని గుంటూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాంటూ అధికారులను కోరారు. ఈ ఫిర్యాదుపైనే అధికారులు స్పందించారు. నోటీసులు జారీ చేశారు.. కూల్చేశారు.

కానీ ఈ గ్యాప్‌లో దీనిపై హైకోర్టును ఆశ్రయించింది వైసీపీ పార్టీ.. తమ పార్టీ కార్యాలయాన్ని కూల్చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై కోర్టు కూడా విచారణ చేపట్టింది. అయితే




ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు.కానీ అంతలోనే జరగాల్సిన తతంగాన్ని జరిపించేశారు అధికారులు.. ఇదీ జరిగింది.. ఇక రాజకీయాల విషయానికి వద్దాం.. వైసీపీ పార్టీ కార్యాలయ కూల్చివేత ముమ్మాటికి కక్ష పూరిత రాజకీయమే అంటోంది వైసీపీ. దీనిపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. చంద్రబాబు ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగు అయిపోయాయంటూ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యవాదులంతా చంద్రబాబు దుశ్చర్యల్ని ఖండించాలని కోరారు. ఇక వైసీపీ నేతలు కూడా కోర్టులో కేసు ఉండగా అధికారులు ఎలా చర్యలు తీసుకుంటారంటూ మండిపడుతున్నారు.జలవనరుల శాఖకు చెందిన స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపించినట్లు తెలిపింది సీఆర్డీఏ,.. వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఇరిగేషన్ శాఖ అభ్యంతరాల్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023 ఫిబ్రవరిలో వైసీపీ ఆఫీసుకు భూమి ఇవ్వలేమని ఇరిగేషన్ ఈఎన్సీ చెప్పారని గుర్తు చేస్తుంది సీఆర్డీఏ,. వైసీపీ కోరిన భూమిలో తాము ట్రైనింగ్ కార్యాలయం నిర్మించదలిచినట్లు అప్పటి ఈఎన్సీ చెప్పారని.. తీవ్ర అభ్యంతరం తెలిపినప్పటికి వైసీపీ ఆఫీస్ నిర్మాణం చేపట్టారంటోంది సీఆర్డీఏ,.ఇదే కాదు.. అనకాపల్లిలో నిర్మిస్తున్న వైసీపీ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కూడా నోటీసులు ఇచ్చింది గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్.. అనుమతులు లేకుండా ఆఫీస్ నిర్మించారన్న జనసేన నేత మూర్తి యాదవ్ ఫిర్యాదుతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఎండాడలో 175/4 సర్వే నెంబర్లోని రెండు ఎకరాల భూమిని అక్రమంగా సేకరించి ఆఫీస్ నిర్మాణం చేపట్టారని మూర్తి యాదవ్ ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. అయితే ఈ చర్యలన్నింటిని కక్షపూరిత చర్యలని ఆరోపిస్తున్నారు వైసీపీ నేతలు దీనిపై కూడా టీడీపీ నేతలు కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇస్తున్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టి.. ఇప్పుడు చర్యలు తీసుకుంటే దానికి కక్షపూరిత రాజకీయాలంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదంటూ కౌంటర్ ఇస్తున్నారు. గతంలో జగన్ ప్రజావేదికను కూల్చేశారు కాబట్టి ఇప్పుడు తాము కూడా.. కూల్చివేతలతోనే పని ప్రారంభిస్తాం.. అన్నట్టుగా టీడీపీ పని చేస్తోందా? అనేది కొందరి ప్రశ్న. అక్రమంగా నిర్మించుకున్న దానిని కూల్చేస్తే తప్పేముందనేది మరికొందరి వాదన.

# బోల్తా పడిన ప్రవేట్ బస్సు

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :

నగర ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు బస్సు చక్రాల కింద నలిగిపోయి దుర్మరణం చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న పలువురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముంబాయి వెళుతోంది. ఈ క్రమంలో నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో బోల్తా పడింది.పోలీసులు నార్సింగ్ ఓఆర్ఆర్ వద్దకు చేరుకుని పరిశీలించారు. ట్రావెల్స్ రోడ్డుకు అడ్డంగా ఉండటంతో 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయినట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలిస్తున్నారు. పోలీసులు గాయపడిన ప్రయాణికులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తున్నారు. క్రేన్ సహాయంతో సిబ్బంది బస్సును తొలగిస్తున్నారు.హైదరాబాద్ ఓఆర్ఆర్ మీద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటనలో షాకింగ్ విషయాలు వెలుగు చూస్తున్నాయి. డ్రైవర్ మద్యం సేవించి ట్రావెల్స్ నడిపాడని తెలుస్తోంది. యాక్సిడెంట్ జరిగిన తరువాత డ్రైవర్ కు డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేయగా రీడింగ్ చాలు పాయింట్ల వరకు చూపించినట్లు అక్కడున్న వారు చెబుతున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా బస్సు నడపడంతో డివైడర్ ను ఢీకొట్టి, వాహనం బోల్తా పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.

# హిందూజా సోదరులకు నాలుగేళ్ల జైలు

న్యూఢిల్లీ,జూన్ 24 (ప్రజాస్వరం) :

హిందూజా కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులకు స్విస్ క్రిమినల్ కోర్టు నాలుగు నుంచి నాలుగున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అదే సమయంలో మానవ అక్రమ రవాణాకు సంబంధించిన మరింత తీవ్రమైన అభియోగాలను కోర్టు తోసిపుచ్చింది. భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త ప్రకాశ్ హిందూజా, ఆయన భార్య, కుమారుడు, కోడలు జెనీవాలోని విలాసవంతమైన లేక్ సైడ్ విల్లాలో పనిచేస్తున్న నిరక్షరాస్యులైన భారతీయులను అక్రమంగా రవాణా చేశారని ఆరోపణలు వచ్చాయి.కార్మికులను దోచుకోవడం, అనధికారిక ఉపాధి కల్పించడంలో నలుగురూ దోషులని కోర్టు పేర్కొంది. తాము ఏం చేస్తున్నామో సిబ్బందికి అర్థమైందనే కారణంతో అక్రమ రవాణా ఆరోపణలను తోసిపుచ్చారు.నలుగురు హిందుజా కుటుంబ సభ్యులు కార్మికుల పాస్ పోర్టులను స్వాధీనం చేసుకున్నారని, వారికి వేతనాలు స్విస్ ఫ్రాంక్ లో కాకుండా రూపాయిలో చెల్లించారని, వారిని విల్లా నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారని, స్విట్జర్లాండ్ లో తక్కువ ధరకు ఎక్కువ గంటలు పని చేయమని బలవంతం చేశారని ఆరోపణలు వచ్చాయి.భారత్ మూలాలున్న ఈ కుటుంబం పిటిషనర్లతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు గత వారం క్రిమినల్ కోర్టులో వెల్లడైంది. దోపిడీ, మానవ అక్రమ రవాణా, స్విస్ కార్మిక చట్టాల ఉల్లంఘన వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల ఆరోపణల నేపథ్యంలో జెనీవా ప్రాసిక్యూటర్లు కేసు నమోదు చేశారు.దశాబ్దాల క్రితం నుంచి హిందూజా కుటుంబం స్విట్జర్లాండ్ లో నివాసం ఏర్పరుచుకొని జీవిస్తోంది. ప్రకాశ్ ఇప్పటికే 2007 లో ఇలాంటి ఆరోపణలపై దోషిగా ఉన్నాడు. అయినప్పటికీ ప్రాసిక్యూటర్లు అతను సరైన పత్రాలు లేకుండా ఇండియా నుంచి వ్యక్తులను తీసుకొని వచ్చి పనిలో పెట్టుకుంటున్నాడని పేర్కొన్నారు.ఈ తీర్పుపై హిందుజా కుటుంబం స్పందిస్తూ.. 'ఈ న్యాయస్థానంలో తీసుకున్న నిర్ణయాలతో దిగ్భ్రాంతికి గురయ్యాం, నిరాశ చెందాం, వాస్తవానికి మేము పైకోర్టుకు అప్పీల్ దాఖలు చేశాం, స్విస్ చట్టాల ప్రకారం అత్యున్నత న్యాయ నిర్ణేత తుది తీర్పును అమలు చేసే వరకు నిర్దోషి అనే భావన చాలా ముఖ్యం' అని బాధిత కుటుంబం మీడియాకు తెలిపింది.ఈ కేసులో పిటిషనర్లు తమ ఫిర్యాదులను ఉపసంహరించుకున్నారని, తాము ఎలాంటి చర్యలకు పాల్పడలేదని కోర్టుకు చెప్పారని తెలిపింది. న్యాయ ప్రక్రియపై తమ కుటుంబానికి పూర్తి విశ్వాసం ఉందని,





నిజా నిజాలు బయటపడతాయన్న నమ్మకం ఉందన్నారు.ప్రకాశ్ హిందూజా, కమల్ హిందుజా, అజయ్ హిందూజా, నమ్రతా హిందుజా తరఫున న్యాయవాదులు యాయెల్ హయత్, రాబర్ట్ అస్సెల్, రొమైన్ జోర్డాన్ వాదనలు వినిపించారు. స్విస్ ప్రాసిక్యూటర్ వైవ్స్ బెర్టోస్సా తెలిపిన వివరాల ప్రకారం.. హిందూజా కుటుంబం తమ పనిమనుషుల్లో ఒకరికి తమ పెంపుడు కుక్క కోసం చేసిన ఖర్చుకంటే తక్కువ డబ్బు చెల్లించింది. భారతీయ ఉద్యోగుల అక్రమ రవాణా, దోపిడీకి సంబంధించి విచారణ సందర్భంగా బెర్టోస్సా ఈ సమాచారాన్ని సమర్పించారు.హిందుజా కుటుంబ చర్యలను తీవ్రంగా విమర్శించిన ప్రాసిక్యూటర్ నిందితులకు ఐదున్నరేళ్ల వరకు జైలు శిక్ష విధించాలని సిఫారసు చేశారు. సిబ్బంది, హిందూజాలు స్వయంగా అందించిన సాక్ష్యాలు, దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాల ఆధారంగా బెర్టోస్సా వాదనలు వినిపించారు.వారు తమ సేవకుల కంటే కుక్క కోసం ఎక్కువ ఖర్చు చేశారు' అని ఆయన చెప్పారు. వారం పాటు రోజుకు 18 గంటలు పనిచేసే మహిళకు ఒకానొక సమయంలో 7 స్విస్ ఫ్రాంక్ లు (7.84 డాలర్లు) మాత్రమే చెల్లించారు. 'పెంపుడు జంతువులు' అనే శీర్షికతో ఉన్న బడ్జెట్ డాక్యుమెంట్ ను ఆయన బెంచ్ ముందు ఉంచారు. ఈ కుటుంబం తమ పెంపుడు కుక్క కోసం సంవత్సరానికి 8,584 స్విస్ ఫ్రాంక్ లను ఖర్చు చేసిందని బెర్టోస్సా అన్నారు.పనిలో పెట్టుకునే సందర్భంలో పని గంటలు, సెలవుల గురించి చెప్పలేదు.

వారి పాస్ పోర్టులు దగ్గర ఉంచుకోవడం.. భారత్ కరెన్సీ రూపీల్లో వేతనాలు చెల్లిస్తున్నందున వారి వద్ద స్విస్ ఫ్రాంక్ లు లేవని, వారు బయట ఏం ఖర్చు పెట్టుకుంటారని, యజమాని అనుమతి లేకుండా ఇంటి నుంచి బయటకు రాలేరని, వారికి స్వేచ్ఛ లేదని బెర్టోస్సా వాదించారు.చట్టపరమైన ఫీజులు, జరిమానాల కోసం వాటిని ఉపయోగించవచ్చని స్విస్ అధికారులు ఆ కుటుంబం నుంచి వజ్రాలు, రుబీలు, ప్లాటినం నెక్లెస్, ఇతర ఆభరణాలు, ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.రిసెప్షన్ల కోసం ఉద్యోగులు గంటల తరబడి పనిచేశారని, కొలోనీ పరిసరాల్లోని విల్లా బేస్మెంట్ లో నిద్రపోయేవారని, కొన్నిసార్లు నేలపై పడుకున్నారని ప్రాసిక్యూటర్లు కోర్టుకు వివరించారు. కమల్ హిందూజా సృష్టించిన భయానక వాతావరణాన్ని వారు అభివర్ణించారు. కొంత మంది ఉద్యోగులు హిందీ మాత్రమే మాట్లాడుతున్నారని, వారికి అందుబాటులో లేని బ్యాంకుల్లో భారతీయ రూపీలో వేతనాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు.2000 సంవత్సరంలో స్విస్ పౌరసత్వం పొందిన ప్రకాశ్ హిందూజాపై స్విస్ అధికారులు తెచ్చిన ప్రత్యేక పన్ను కేసు పెండింగ్ లో ఉంది.ముగ్గురు సోదరులతో కలిసి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మీడియా, విద్యుత్, రియల్ ఎస్టేట్, హెల్త్ కేర్ వంటి రంగాల్లో పారిశ్రామిక దిగ్గజానికి నేతృత్వం వహిస్తున్నారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రస్తుతం హిందూజా కుటుంబం నికర విలువను 20 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది.

# సౌత్‌లో కమలం వికసిస్తోందా...

బెంగళూరు, జూన్ 24 (ప్రజాస్వరం) :

బీజేపీని ఉత్తరాది పార్టీ అంటారు. దక్షిణాదిన కూడా విస్తరించాలని బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో చాలా వరకూ ముందడుగు వేసింది. వచ్చే ఎన్నికల నాటికి కొన్ని రాష్ట్రాలను కమ్మేసినా ఆశ్చర్యం లేదన్న ఫలితాలు వచ్చాయి. సీట్ల పరంగా మాత్రమే కాదు.. ఓట్ల పరంగా కూడా. నిలకడగా పెరుగుతున్న బీజేపీ ఓటు బ్యాంక్ దక్షిణాదిలో ఆ పార్టీ పవర్ గా మారుతోంది. గతంతో పోలిస్తే ఈ సారి సీట్లు పెద్దగా పెరగలేదు కానీ.. ఓట్లు మాత్రం ఊహించని విధంగా పెరిగాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చూస్తే మొత్తంమీద బిజెపికి యూపీ, మహారాష్ట్రతో పాటు కొన్ని రాష్ట్రాల్లో ఎదురు దెబ్బ తగిలింది. కేవలం 240 స్థానాలు మాత్రమే తెచ్చుకోగలిగింది. 2014, 2019 ఎన్నికలలో వచ్చిన ఫలితాలను చేరుకోలేకపోయింది. నరేంద్ర మోడీ ఇప్పుడు నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించాల్సి వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి తీవ్రంగా నష్టపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలోనూ దెబ్బతిన్నది. కానీ ఒడిషాలో బిజెపి మున్నెన్నడూ లేని విజయాలు సాధించింది. 21 లోక్‌సభ స్థానాలలో 20 తెచ్చుకోవడమే గాక మొట్టమొదటి సారిగా అక్క ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. ఇక ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ క్రమంగా బలపడుతోంది. సీట్ల వారీగా చూసినప్పుడు బిజెపి ఈ ప్రాంతంలో పెద్ద పురోగతి సాధించినట్టు కనిపించకపోవచ్చు. ఎందుకంటే అయిదు దక్షిణాది రాష్ట్రాలలో కలిపి దానికి 2019లో 29 సీట్లు వస్తే ఇప్పుడు 2024 లోనూ ఆ సంఖ్య పెరిగింది లేదు. కానీ రాష్ట్రాల వారీ పరిస్థితులు, ఓట్ల వాటా బాగా లోతుగా విశ్లేషిస్తే ఓట్ల శాతం గణనీయంగా పెంచుకుంటూ వెళ్తోంది. తెలంగాణలో బిజెపికి 2019లో నాలుగు సీట్లు, 19.45 శాతం ఓట్లు రాగా 2024 ఎన్నికలలో ఆ సంఖ్య రెట్టింపై 8 సీట్లు గెలవగలిగింది. ఓట్ల వాటా కూడా గణనీయంగా 35.19 శాతానికి పెరిగింది. బిఆర్ఎస్ ఓట్ల వాటా దారుణంగా పడిపోవడం బిజెపికే మేలు చేసింది. కర్ణాటకలో బిజెపికి కొంత బలం పోగొట్టుకున్నది. కానీ ఓట్లు కోల్పోలేదు. 2019 ఎన్నికలలో అది 25 సీట్లు 51.38 శాతం ఓట్లు తెచ్చుకుంటే ఇప్పుడు 17 సీట్లకు పరిమితమై 46.09 శాతం ఓట్లు తెచ్చుకోగలిగింది. అయితే జత కలిసిన జేడీఎస్ 5.64 శాతం ఓట్లు తెచ్చుకోవడంతో మొత్తం ఎన్‌డిఎ ఓట్ల శాతం 51.73 అయింది. అంటే బలం నిలబడినట్లే. తమిళనాడులో బీజేపీ ఒక్క సీటు కూడా తెచ్చుకోలేకపోయింది. 2019లో అయిదు సీట్లకు పోటీ చేసిన బిజెపి ఓట్ల శాతం 3.66 శాతం అయితే ఇప్పుడు 11.24 శాతానికి పెరిగింది. పది నియోజక వర్గాలలో బిజెపి రెండవ స్థానంలో వచ్చింది. అంటే కొన్ని సీట్లలో అది ఎఐడిఎంకె ఓట్లను తెచ్చుకోగలిగిందని అర్థమవుతుంది. కేరళలో బిజెపి త్రిసూర్ సీటు గెలిచి మొదటిసారి ఒక లోక్‌సభ స్థానం పొందగలిగింది. 2019లో 12.9 శాతం ఓట్ల శాతం వుంటే ఇప్పుడు 16.67 శాతానికి పెరిగింది. మొత్తం ఎన్‌డిఎ వాటా 19.2 శాతానికి అంటే కేరళలో ఎన్నడూ రానంత అధికంగా పెరిగింది. బిజెపి చాలా బలహీనంగా వున్న ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పొత్తు వల్ల లాభపడింది. 2019లో కేవలం 0.96 శాతం ఓట్లు మాత్రమే తెచ్చుకున్న ఆ పార్టీ ఇప్పుడు మూడు పార్లమెంటు సీట్లు గణనీయమైన ఓట్లను సాధించింది. బీజేపీ కర్ణాటకలో రెండు దశాబ్దాల కిందటే బీజేపీ బలమైన పునాది ఏర్పర్చుకుంది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలలో కూడా నెమ్మదిగా అప్పుడప్పుడూ ఆగుతూనైనా బిజెపి ముందుకు సాగుతున్నది. బీజేపీ రాజకీయాలు చాలా దూరదృష్టితో ఉంటాయి. వచ్చే ఎన్నికల నాటికి హిందీ రాష్ట్రాల్లో దెబ్బతిన్నా సౌత్ లో భారీ విజయాలతో నాలుగోసారి గెలవాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్లాన్ చేసుకుటున్నారు. దక్షిణాదిలో ఆ పార్టీ వ్యూహం అదే నిరూపిస్తోంది.

# కూల్చివేతపై విమర్శలు చేయటం సరికాదు

**అనుమతులు ఉంటే చూపించాలి: పల్లా శ్రీనివాస్**

విశాఖపట్నం, జూన్ 24 (ప్రజాస్వరం) :

ఎన్నికల్లో ఘోర ఓటమిని మాజీ సీఎం జగన్ జీర్ణించుకోలేక పోతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీ తొలి సమావేశానికి జగన్ గైర్హాజరవటం సిగ్గుచేటని పల్లా విమర్శించారు. అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేతపై జగన్ విమర్శలు చేయటం సరికాదని, పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు అనుమతులు ఉంటే చూపించాలన్నారు. 100 రోజుల్లోనే అక్రమ కేసులను ఎత్తేస్తాం అని పల్లా శ్రీనివాస్ తెలిపారు.మాజీ సీఎం జగన్ ఓటమిని ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారని విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గత ఎన్నికల్లో 151 స్థానాలు కైవసం చేసుకుని కాలరెగరేసిన జగన్, ఈసారి 11 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా లేకపోయేసరికి తన హుందాతనాన్ని మరిచిపోయారన్నారు. జగన్ ప్రతి పక్ష హోదా లేకపోయినా సభలో వారి పట్ల హుందాతనంగా ఉండాలని సీఎం చంద్రబాబు చెప్పారని, జగన్ మాత్రం ఆ విధంగా వ్యవహరించడం లేదని శ్రీనివాసరావు అన్నారు. అందుకు అసెంబ్లీ తొలి సమావేశానికి జగన్ గైర్హాజరు కావటమే నిదర్శనమని విమర్శించారు. ప్రజా వేదిక కూల్చి వేతకు శ్రీకారం చుట్టింది వైఎస్సార్సీపీ ప్రభుత్వం అని, అనుమతులు లేని వైఎస్సార్సీపీ కార్యాలయాలను కూల్చివేస్తుంటే తెలుగుదేశంపై జగన్ విమర్శలు చేయటం సరికాదని అన్నారు. అమరావతిలో నీటి పారుదల శాఖ స్థలంలో అనుమతి లేకుండా పార్టీ కార్యాలయం ఎలా కట్టారో వైఎస్సార్సీపీ నాయకులు చెప్పాలన్నారు. ప్రజస్వామ్యయుతంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం, అమరావతి అంశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకార సమయంలో చట్టాలు గౌరవిస్తాను అని చెప్పిన జగన్, మరుసటి రోజునే ఆ మాట మరచి పోయారు అన్నారు. జగన్మోహన్ రెడ్డికి చట్టాలు అంటే గౌరవం ఉంటే ఇకనైనా సభలకు వచ్చి ప్రజాస్వామ్యయుతంగా ప్రవర్తించాలన్నారు.



## కొట్టుకుపోయిన అందవెల్లి తాత్కాలిక వంతెన..

**నిలిచిన రాకపోకలు**

కాగజ్ నగర్, జూన్ 24 (ప్రజాస్వరం) :

కాగజ్నగర్ మండలం అందవెల్లి వద్ద గల పెద్దవాగు బ్రిడ్జ్ తాత్కాలిక వంతెన రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆదివారం తెల్లవారుజామున కొట్టుకుపోయింది. దీంతో దహేగాం- కాగజ్నగర్ మండలాలలోని దాదాపుగా 42 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సోమవారం ఉదయానికి కుడా ఆదే పరిస్థితి. గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జ్ రెండు పిల్లర్లు కూలిపోయాయి. దీంతో నూతన బ్రిడ్జ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులు ఆలస్యం అవుతుండటంతో ప్రజలు తాత్కాలిక వంతెనను రాకపోకలకు ఉపయోగిస్తున్నారు.ఈ వంతెన తెగిపోవడంతో ఈ వర్షాకాలం పూర్తయ్యే వరకు ప్రజల రాకపోకలకు కష్టాలు తప్పేలా లేదు.

## హస్తం గూటికి మరో ఎమ్మెల్యే

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :

ప్రతిపక్ష %దీ=ూ% పార్టీకి మరో షాక్ తగిలింది. జగిత్యాల బీఆరెస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండువా కప్పి సంజయ్ కుమార్ ను పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి %దీ=ూ% ను వీడి కాంగ్రెస్ లో చేరడం తెలిసిందే.తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా తమ భావజాలంతో కలిసి పనిచేసే వారిని అందర్నీ కలుపుకుని వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. లోక్ సభ ఎన్నికలు ఉండటంతో కొన్ని నెలలపాటు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్టానం ఎంపీ స్థానాలు నెగ్గడంపై ఫోకస్ చేసింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదల తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ను బలోపేతం చేయడంపై రేవంత్ దృష్టిసారించారు. ఈ క్రమంలో తెలంగాణ మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ లో చేర్చుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారంతో పాటు సీనియర్ నేత కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో మూడో రోజుల కిందట పోచారం హస్తం పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నేతలు దీన్ని తీవ్రంగా తప్పుపట్టారు. పార్టీలో పదవులు అనుభవించి, కష్టకాలంలో బీఆర్ఎస్ కు అండగా ఉండాల్సింది పోయి, ఈ వయసులో పార్టీ మారడం సిగ్గుచేటంటూ విమర్శించారు.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకున్నారు కేసీఆర్. టీడీపీ మెజార్టీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరడంతో టీడీఎల్పీ విలీనం చేసినట్లు అయింది. 2014 ఎన్నికల తరువాత వైఎస్సార్ సీపీ, బీఎస్పీ ఎమ్మెల్యేలు సైతం కారు పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ కు భారీ మెజార్టీ వచ్చినా కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ను వీడి గులాబీ పార్టీలో చేరిపోయారు. గత ఏడాది నవంబర్ ఎన్నికల తరువాత కాంగ్రెస్ తొలిసారి తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన కొన్ని రోజులకే బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ లో చేరారు. మొదట తాను మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్ రెడ్డిని, మంత్రులను కలిశానని చెప్పారు. ఆపై కాంగ్రెస్ నిర్వహించిన సభలోనూ కనిపించి కేసీఆర్ కు షాకిచ్చారు వెంకట్రావు. ఇంకా చెప్పాలంటే ఈ అసెంబ్లీ ఎన్నికల తరువాత కేసీఆర్ కు షాకిస్తూ బీఆర్ఎస్ ను వీడిన తొలి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు. ఆపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం హస్తం గూటికి వెళ్లారు.లోక్ సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు కాంగ్రెస్, బీజేపీలో చేరి టికెట్లు సైతం సాధించారు. దానం నాగేందర్ సికింద్రాబాద్ నుంచి పోటీచేసి బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి చేతిలో ఓటమి చెందారు. బీఆర్ఎస్ వరంగల్ టికెట్ ఇచ్చినా ఆ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరారు కడియం శ్రీహరి, కడియం కావ్య. లోక్ సభ ఎన్నికల్లో కడియం కావ్య గెలుపొందారు. మరోవైపు లోక్ సభ ఎన్నికల్లో 17 సీట్లలో కేసీఆర్ పార్టీ బీఆర్ఎస్ కు ఒక్క సీటు కూడా రాకపోవడం కేసీఆర్ ను పునరాలోచనలో పడేసింది. ఇటీవల పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి కీలక నేత బీఆర్ఎస్ ను వీడగా, తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ సైతం గులాబీ పార్టీని వీడి హస్తం పార్టీకి వచ్చారు.

## వరంగల్ వర్షాల కోసం పూజలు

వరంగల్, జూన్ 24 (ప్రజాస్వరం) :

తెలంగాణలో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు కురిసినా కొన్ని వరంగల్.. సిద్దిపేట జిల్లాలో వర్షాలు కురవలేదు.వర్షాభావ పరిస్థితులు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో వర్షాలు కురవాలని వరంగల్ జిల్లాలో వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. హనుమకొండలోని పద్మాక్షి కాలనీలో పోచమ్మతల్లి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు చేశారు మహిళలు. విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలతో సుఖంగా ఉండాలని మహిళలు నీళ్ల బిందెలు ఎత్తుకొని ఆలయాలకు చేరుకుని విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. పసుపు-కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు.పౌర్ణమి రోజున పోచమ్మకు ప్రత్యేక పూజలు చేస్తే వర్షాలు కురుస్తాయని గ్రామస్తులు ప్రగాఢంగా నమ్ముతున్నారు. గతంలోనూ ఇలాంటి పూజ చేయడం వల్ల తమ మొక్కులు ఫలించయంటున్నారు మహిళలు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోతున్నామని.. ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిద్ధిపేట జిల్లాలోను వర్షాల కోసం కప్పల పెళ్లి నిర్వహించారు.రెండు కప్పలకు పసుపు నీళ్లతో స్నానం చేయించి, మంత్రోచ్చారణల మధ్య ఆ రెండు కప్పులకు అందరూ చూస్తుండగా వివాహం జరిపించారు. ఈ ఆచారంలో భాగంగా మహిళా రైతులు కప్పలకు నీళ్లు పోస్తుంటే పిల్లలు కర్రకు కట్టిన కొత్తగా పెళ్లయిన కప్పల జంటను తీసుకొని గ్రామమంతా తిరిగారు.

## మైలార్ దేవ్ పల్లిలో రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్

రంగారెడ్డి, జూన్ 24 (ప్రజాస్వరం) :

మైలార్ దేవ్ పల్లిలో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. ఓ హెయిర్ సెలూన్ పై దాడి.సెలూన్ లో ఉన్న ఫర్నీచర్ ధ్వంసం చేసారు. యజమాని పై విచక్షణారహితంగా పిడుగుద్దుల వర్షం కురిపించారు. ముగ్గురు గంజాయి గ్యాంగ్ గాళ్లు సెలూన్ కు వచ్చి హెయిర్ కట్టింగ్ చేయించుకున్నారు. డబ్బులు అడిన పాపానికి యజమాని పై దాడిచేసారు. మా దగ్గర డబ్బులు అడుగుతావా అంటూ రెచ్చిపోయి హంగామా చేసారు గంజాయి మత్తులో నానా హంగామా చేసారు. అడ్డు వచ్చిన స్థానికుల పై దాడి కి దిగా,రు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# అభిమానులతో సరదాగా చిందులేసిన తిరువూరు ఎమ్మెల్యే

**మేడ్చల్, జూన్ 24 (ప్రజాస్వరం) :**

హైదరాబాద్ నాచారం లో తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు టిడిపి అభిమానులు అభినందన సభ ఏర్పాటు చేశారు . ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కొలికపూడీ శ్రీనివాసరావు హైదరాబాద్ రావడంతో నాచారంలో శేషగిరి రావు ఆధ్వర్యంలో టిడిపి అభిమానులు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు అభిమానులతో కలిసి డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఆంధ్రప్రదేశ్ అమరావతి పునర్మాణం అవుతుందన్నారు. గత ఐదు సంవత్సరాలు జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన నుండి ఆంధ్రప్రదేశ్ కాపాడే లక్ష్యంగా ఏదైతే పవన్ కళ్యాణ్ ఓట్లు చీలకూడదని లక్ష్యంతో రాజకీయంగా అన్ని సర్దుబాటు చేసుకొని కూటమి భారీ మెజార్టీతో 164 స్థానాలలో ఎమ్మెల్యేలతో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డదన్నారు. ఈ నేపద్యంలో కూటమి ప్రభుత్వం ముందు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయన్నారు. అమరావతి నిర్మాణం, పోలవరం నిర్మాణం పూర్తి లక్ష్యాలతో అన్ని ప్రాంతాల అభివృద్ధి అన్ని వర్గాల సంక్షేమం కోసం కూటమి పనులు చేస్తుందని తెలిపారు

# టిట్ ఫర్ టాట్.. బూమ్ రాంగ్ అవుతుందా

**హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :**

రెండు సార్లు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీలను కేసీఆర్ విలీనం చేసుకున్నాడు.. అయినా కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేకపోయారు కదా...ఆయన పార్టీ ఎమ్మెల్యేలు మాకెందుకు ?" అని ఎన్నికల్లో గెలిచిన తర్వాత మీడియా ఇంటర్వ్యూల్లో తెలంగాణ సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చెప్పారు. అప్పటికీ కాంగ్రెస్ నేతల ఆలోచనలు టిట్ ఫర్ టాట్ అనే దారిలో ఉన్నాయి. అంటే కేసీఆర్ రెండు సార్లు తమ ఎల్పీల్ని విలీనం చేసుకున్నారు కాబట్టి.. తాము కూడా ఈ సారి బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకోవాలని.. ఆ దిశగా రేవంత్ రాజకీయం చేయాలని కోరుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి కేసీఆర్ చేసిన తప్పుల్ని తాను చేయకూడదన్నట్లుగా పరిణితితో మాట్లాడారు. కానీ పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత సీన్ మారిపోయింది. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్ని చేర్చుకునేందుకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్‌కు ఇప్పుడు ఉన్న ముప్ఫై ఐదు మంది ఎమ్మెల్యేల్లో కనీసం పదిహేను మందికి అసెంబ్లీ ఎన్నికలుక ముందు కండువా కప్పేందుకు సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత .. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని పార్టీలోకి ఆకర్షించారు. అందు కోసం అధికార బలాన్ని ప్రయోగించారు. మనకు అవసరం లేదు కదా ఎందుకు అని.. అని అంటే వారు కాంగ్రెస్ లో ఉంటే.. ఏదో ఒకటి వాగుతూ ఉంటారు.. మన పార్టీలో చేర్చుకుంటే సైలెంట్ గా ఉంటారని సమాధానం చెప్పారని ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓ సారి బహిరంగంగానే చెప్పారు. అంటే.. ప్రతిపక్ష నేతలు విమర్శలు చేయకుండా వారిని నిర్వీర్యం చేయడానికి తమ పార్టీలోకి కేసీఆర్ ఆహ్వానించేవారు. దీని వల్ల ఆయన పార్టీ ఎంత నష్టపోయిందో.. ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. పార్టీలో పెద్ద ఎత్తున గ్రూపులు పెరిగిపోయాయి. నేతలు ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరాటం చేసుకుంటూ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారు. పొటెన్షియల్ లీడర్లు కొంత మందికి టిక్కెట్లు దక్కక కాంగ్రెస్ లో చేరిపోయి విజయం సాధించారు. అంటే కేసీఆర్ చేసిన చేరికల రాజకీయాలు కాంగ్రెస్ పార్టీని ఏ మాత్రం బలహీనం చేయకపోగా..రివర్స్ లో బీఆర్ఎస్‌కే మైనస్ అయ్యాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నేతలు.. బీజేపీ నేతలు ప్రభుత్వం ఎంత కాలం ఉంటుందో తెలియదని కామెంట్స్ చేశారు. కానీ అది మైండ్ గేమే. ఇప్పుడు రేవంత్ సర్కార్ కు వచ్చిన ముప్పేమీ లేదు. బీజేపీ పార్లమెంట్ సీట్లు కాంగ్రెస్ తో సమానంగా గెల్చుకుంది. కేంద్రంలో మిత్రపక్షాల అండతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ .. కాంగ్రెస్ సర్కార్ జోలికి అసలు రాదు. బీఆర్ఎస్‌కు అసలు అలాంటి అవకాశం కూడా లేదు. అయినా రేవంత్ .. ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు రెడీ అయిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ 39 సీట్లు గెలిచింది. అయితే ఇందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఉపఎన్నిక వచ్చింది. ఆ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిచింది. సో సంఖ్య 38కి తగ్గింది. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరంతా కాంగ్రెస్‌కు కలిశారు. అంటే ఎమ్మెల్యేల సంఖ్య 68కి చేరింది. బీఆర్ఎస్ కు ఇప్పుడు 35 మంది ఎమ్మెల్యేలు మిగిలారు. వీరిలో పదిహేను మంది వరకూ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే కాంగ్రెస్ చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పార్టీలో చేరే వారంతా పూర్తిగా అధికారం అనే బెల్లముక్క చుట్టూ చీమలు, ఈగలుగా చేరేందుకు వస్తున్నవారే. ఎందుకంటే వారు ఇప్పటి వరకూ కాంగ్రెస్ ను ఓడించేందుకు పని చేశారు. పార్టీలో పదవులు లేదా ప్రభుత్వంలో నామినేటెడ్ ప దవులు.. ఇంకా ఆర్థిక ప్రయోజనాలు ఆశించి చేరే వారు కూడా ఉంటున్నారు. ఇప్పుడు ఇలాంటి నేతలే రేవంత్ రెడ్డికి అతి పెద్ద సవాల్ . తెలంగాణ ఎన్నికల్లో ఏటికి ఎదురీది గెలిచారు. ప్రస్తుతం పార్టీలో చేరుతున్న వారంతా కాగ్రెస్ పార్టీని ఓడించడానికి సర్వశక్తులు ఒడ్డిన వాళ్లే. కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదని నమ్మిన వాళ్లే. బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఇలాంటి నేతలు కూడా కారణం. ఇప్పుడు గేట్లు ఎత్తి ఈ సమస్యను తన నెత్తి మీద వేసుకుంటోంది కాంగ్రెస్ పార్టీ. పదేళ్లు పార్టీ కోసం కష్టపడిన వారు ఉన్నారు. దశాబ్దం పాటు పార్టీ కోసం కష్టపడిన వారు.. అసలు పార్టీకి భవిష్యత్తే ఉండదన్న భావన వచ్చినప్పటికీ పార్టీని వదిలి పెట్టని వారు ఉన్నారు. వారిలో చాలా మంది గ్రామ, మండల స్థాయిలోనే ఉన్నారు. నిజానికి కాంగ్రెస్ ఎప్పటికప్పుడు బలంగా ఉందన్న భావన రావడానికి లీడర్లు పోయినా క్యాడర్ పోలేదని అనుకోవడమే. బీఆర్ఎస్ నేతలంతా పోలోమని కాంగ్రెస్ లోకి వస్తే.. మరి వారికి అన్యాయం చేసినట్లే అవుతుంది. అందర్నీ గుర్తిస్తామని రేవంత్ చెబుతున్నారు. కానీ అది మాటల్లో అంత తేలిక కాదు.అయితే బీఆర్ఎస్ పార్టీని బలహీనం చేయవచ్చు అన్న వ్యూహంతోనే చేరికలను ప్రోత్సహిస్తున్నారని అనుకోవచ్చు. కానీ అది రివర్స్ కూడా అయ్యే అవకాశం ఉంది.త కేసీఆర్‌కు అలాగే అయింది. రేవంత్ ఈ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# నలిగిపోతున్న సామాన్యులు

**వరంగల్, జూన్ 24 (ప్రజాస్వరం) :**

ఒకరు ప్రజా ఉద్యమాల పేరుతో అడవుల్లో ఉండి పోరాడే అన్నలు.. మరొకరు శాంతి భద్రతల పేరుతో ప్రభుత్వం తరపున విధులు నిర్వహించే పోలీసులు. ఇప్పుడు ఇద్దరు అడవుల్లో ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం పోరాడుతున్నారు. వీరి మధ్య ఆధిపత్య పోరులో అమాయక గిరిజనులు, ప్రజలు బలవుతున్నారు. ఛత్తీస్ గఢ్, తెలంగాణ సరిహద్దులో కొనసాగుతున్న భయానక పరిస్థితి ఇదిఛత్తీస్ గఢ్ దండకారణ్యంలో వరుస ఎన్ కౌంటర్లతో అడవి దద్దరిల్లుతుంది. ఐదు నెలల నుంచి వరుస ఎన్కౌంటర్లు జరుగుతుండడంతో మావోయిస్టు పార్టీ నేతలు ప్రతి ఎన్ కౌంటర్ లో పదుల సంఖ్యలో చనిపోతున్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత లో పోలీసులు పైచేయి సాధిస్తున్నారని చెప్పవచ్చు. ఛత్తీస్ గఢ్ అభయారణ్యాన్ని పోలీసులు చుట్టుముట్టి భారీ క్యాంపులను ఏర్పాటు చేసుకున్నారు. పోలీస్ లు అడవుల్లోకి రాకుండా వారి వ్యూహాలను దెబ్బతీయడమే లక్ష్యంగా మావోయిస్టులు ఆడవుల చుట్టూ, అడవిలో క్లైమర్ మైన్స్, ప్రెజర్ బాంబులు అమరుస్తున్నారు.ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన తెలంగాణ, ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లో భయానక వాతావరణం నెలకొంది. ఈ సంవత్సరం జనవరి నుండి సాగుతున్న కగార్ పేరుతో మావోయిస్టు ఏరివేత ఆపరేషన్ లో సుమారు 150 మంది మావోయిస్టులు చనిపోయారు. ప్రతీకారంతో రగిలిపోతున్న మావోయిస్టులు పోలీసులే లక్ష్యంగా కొంగల, కర్రెగుట్ట అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు క్లైమెర్ మైన్స్, ప్రెజర్ బాంబులు అమరుస్తున్నారు. పోలీసుల లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన బాంబులు పేలి అమాయక ప్రజలు చనిపోతున్నారు. కొంగల, కర్రెగుట్ట ప్రాంత అడవులు ఛత్తీస్ గఢ్ తెలంగాణ సరిహద్దుల్లో విస్తరించి ఉన్నాయి. రెండు రాష్ట్రాలకు చెందిన గిరిజనులు, ప్రజలు వివిధ పనుల కోసం అడవుల నుండి అటు ఇటు వచ్చి వెళ్తుంటారు. కొందరు వంట చెరుకు కోసం మరికొందరు అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్తారు. అయితే పోలీసులు లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన బాంబులు పేలి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. జూన్ 3వ తేదీన కొంగల అటవీ ప్రాంతంలో వంట చెరుకు కోసం ఇల్లందుల ఏసు అనే వ్యక్తి వెళ్ళాడు. వంటచెరుకు సేకరిస్తున్న క్రమంలో ప్రెజర్ బాంబు పేలి మృతి చెందాడు. దీంతో మావోయిస్టు పార్టీ వెంటనే స్పందించి ఓ లేఖ విడుదల చేసింది. గిరిజనులు, గిరిజనేతరులు కొంగాల, కర్రెగుట్ట అటవీ ప్రాంతాల్లోకి రావద్దని పోలీసుల లక్ష్యంగా బాంబులను అమర్చడం జరిగిందని మావోయిస్టులు లేఖ లో పేర్కొన్నారు. దీంతో ప్రజలు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లడానికి జంకుతున్నారు. కానీ వీరి జీవనమే అడవిలో కాబట్టి వెళ్ళాక తప్పడం లేదు. ఏసు మృతి మరువకముందే ఈనెల 13వ తేదీన కర్రెగుట్ట అడవిలోని బెదంగుట్ట సమీపంలో ఉన్న శివాలయం దర్శనానికి వెళ్తున్న సునీతా అనే మహిళ మావోయిస్టులు అమర్చిన బాంబు పేలి తీవ్రంగా గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సునీత కాలును తొలగించాల్సి వచ్చింది. దీంతో అటవీ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజల ఎక్కడ ఏ బాంబు ఉంటుందో అవి పేలి ఎవరి ప్రాణాలు పోతాయో అనే భయంతో బిక్కుబిక్కుమంటున్నారు.వంట చెరుకు కోసం అడవిలోకి వెళ్లిన యేసు మృతిని నిరసిస్తూ వెంకటాపురం మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజలు మావోయిస్టులకు వ్యతిరేకంగా జగనాధపురంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అధిపత్యం కోసం అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని నినాదాలు చేశారు. ప్రజల నిరసనతో మావోయిస్టులు కంగుతిన్నారు.అయితే ఏసు మృతి చెందిన వెంటనే మావోయిస్టు పార్టీ అడవుల్లోకి రావద్దు మావోయిస్టులు లేఖ విడుదల చేయడం తెలిసిందే. ములుగు జిల్లా ఎస్పీ పేరుతో మావోయిస్టులకు వ్యతిరేకంగా లేఖ విడుదల చేశారు. అడవుల్లోకి ప్రజలు, పోలీసులు రాకుండా టార్గెట్ చేసి బాంబులు అమర్చారని, మావోయిస్టులు అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నారని లేఖలో పేర్కొన్నారు.అయితే ఎవరి ఆధిపత్యం కోసం వారు కాల్పులు జరుపుకోవడం.. లేఖలు విడుదల చేసుకోవడం జరుగుతుంది. ఇటు మావోయిస్టు అటు పోలీసుల అధిపతి పోరులు అభం శుభం తెలియని అడవులను నమ్ముకొని జీవిస్తున్న అమాయక ప్రజలు బలవుతున్నారు. పది రోజుల వ్యవధిలోనే రెండు ఘటనలు జరిగాయి. ఒకరు చనిపోగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కర్రెగుట్ట, కొంగాల అటవీ ప్రాంతాల చుట్టుపక్కల ఉన్న ప్రజలు భయంతో బ్రతకాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఆధిపత్య పోరు ఇక్కడతోనే అగుతుందా లేక కొనసాగుతున్న అనే భయాందోళనలో అటవీ ప్రాంత చుట్టుపక్కల ప్రజలు గిరిజనులు భయంతో బతకాల్సిన పరిస్థితులున్నాయి.

# బీఆర్ఎస్ న్యాయపోరాటం

**హైదరాబాద్, జూన్ 24, (ప్రజాస్వరం) :**

పార్టీ మారుపోతున్న ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ ఆపలేకపోతోంది. బుజ్జగింపుల ద్వారా సాధ్యం కావడం లేదు కాబట్టి .. వారిలో అనర్హతా వేటు భయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ మారిన వారందరిపై అనర్హతా వేటు వేయించేందుకు సుప్రీంకోర్టుకైనా వెళ్లేందుకు వెనుకాడేది లేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ సీఎం కేసీఆర్, కేటీఆర్ లకు అత్యంత సన్నిహితులైన వారు పార్టీ వీడిపోతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివసారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం బీఆర్ఎస్ అగ్రనేతలకు ఊహించని షాక్ లాంటిది. వారిని అత్యంత నమ్మకస్తులుగా కేసీఆర్ భావిస్తారు. జగిత్యాల సంజయ్ కుమార్ గెలుపును కల్వకుంట్ల కవిత రెండు సార్లు తన సొంత గెలుపుగా భావించి పని చేశారు. ఆయన కూడా పార్టీ మారిపోవడంతో ఇక రాజకీయాల్లో విశ్వసనీయతకు అర్థం లేదని అనుకుంటున్నారు. అంతకు ముందే కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు వంటి వారు కాంగ్రెస్ లో చేరిపోయారు. వారందిరపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తున్నారు బీఆర్ఎస్ అగ్రనేతలు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లో అనర్హత పిటిషన్ పైన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ వాదిస్తోంది. దానం నాగేందర్ పార్టీ మారినప్పుడు ఆయనపై స్పీకర్ కార్యాలయంలో పార్టీ ఫిరాయింపు పిర్యాదు ఇచ్చారు. తర్వాత హైకోర్టులోనూ పిటిషన్లు వేశారు. వాటిపై విచారణ జరగాల్సి ఉంది. మరో వైపు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు వరుసగా పార్టీ మారిపోతున్నారు. కేసీఆర్ కుటుంబానికి అత్యంత నమ్మకస్తులైన వారిపై వచ్చే ఒత్తిళ్లు తీవ్రంగా ఉంటాయి కాబట్టి.. మూడో కంటికి తెలియకుండా కండువా కప్పేస్తున్నారు. మిగిలిన ఎమ్మెల్యేలు అందర్నీ ఢిల్లీకి పిలిపించి కండవాలు కప్పుతారని.. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేస్తారని అంటున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా అనర్హతా వేటు అస్త్రాన్ని బీఆర్ఎస్ ప్రయోగిస్తోంది. అయితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం స్పీకర్ దే తుది నిర్ణయం. స్పీకర్ ఫలానా నిర్ణయం తీసుకోవాలని.. లేదా ఫలానా తేదీలోపు నిర్ణయం తీసుకోలేవని నిపుణులు చెబుతున్నారు. మహారాష్ట్ర విషయంలో అక్కడ పార్టీల్లో చీలిక వచ్చిందని ఈ కారణంగా ఏ పార్టీ వారు ఏ పార్టీలో చేరారన్నది స్పీకర్ తేల్చలేకపోవడం వల్ల మూడు నెలల గడువు పెట్టారని అంటున్నారు. మామూలుగా అయితే అధికార పార్టీల్లో చేరే ఎమ్మెల్యేలపై అనర్హతకు సంబంధించి స్పీకర్లు నిర్ణయాలు తీసకోవడం లేదు. అధికార పార్టీ వ్యూహంలోనే భాగంగానే వారు పార్టీలో చేరుతున్నారు. అయితే న్యాయపోరాటం చేసి అయినా సరే వాళ్లను మాజీలను చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

# సచివాలయంలో మంత్రి నారా లోకేష్ బాధ్యతల స్వీకరణ!

**విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల అభినందనలు**

**మెగా డిఎస్సీ విధివిధానాల ఫైలుపై లోకేష్ తొలి సంతకం**



**అమరావతి, జూన్ 24 (ప్రజాస్వరం) :**

రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సచివాలయంలో సోమవారం నిరాడంబరంగా బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సచివాలయంలోకి అడుగుపెట్టిన లోకేష్.. 4వ బ్లాక్ ఫస్ట్ ఫ్లోర్ రూమ్ నంబర్ - 208 చాంబర్ లో బాధ్యతలు చేపట్టారు. మెగా డీఎస్సీ విధివిధానాలకు సంబంధించిన ఫైలుపై లోకేష్ తొలిసంతకం చేసి, కేబినెట్ కు పంపారు. పలువురు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ నాయకులు లోకేష్ ను కలిసి అభినందనలతో ముంచెత్తారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, టీజీ భరత్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బోండా ఉమామహేశ్వరరావు, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ వేమూరి రవికుమార్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ప్రధాన కార్యదర్శి రవినాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం, మాజీ ఎమ్మెల్సీలు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎస్ రామకృష్ణ, బుద్దా నాగ జగదీష్, అంగర రామ్మోహన్ రావు, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ నాగుల్ మీరా తదితరులు లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపారు.

# మళ్లీ చరిత్ర పునరావృతమౌతుంది....

**హైదరాబాద్, జూన్ 24, (ప్రజాస్వరం) :**

హస్తం పార్టీలో మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్ మొదలైంది.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి.. మొదట్లో ముగ్గురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరగా.. ఇటీవల మాజీ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు.. అయితే.. కేసీఆర్ కుటుంబానికి సాన్నిహిత్యంగా ఉండే వారే పార్టీను వీడుతుండటం.. ప్రస్తుత ఫిరాయింపు రాజకీయ పరిస్థితులపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చరిత్ర పునరావృతం అవుతుంది%" అంటూ కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్న పార్టీ ఫిరాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. అధికారంలో ఉన్నామని విర్రవీగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని కాంగ్రెస్ కు హెచ్చరించారు.ప్రజాస్వామ్యంలో ప్రజల శక్తి ఎప్పుడు అధికారంలో ఉన్నవారి కన్నా కూడా బలంగా ఉంటుందని కేటీఆర్ అన్నారు.. 2004-06 సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సార్లు పార్టీ ఫిరాయింపులకు పాల్పడింది. అప్పుడు కూడా బీఆర్ఎస్ ఇబ్బందులను ఎదుర్కొంది. ఇలాంటి కష్టసమయాలు బీఆర్ఎస్ కు కొత్త కాదు. కానీ కాంగ్రెస్ పార్టీ నీతి లేని వ్యవహారాలపై తెలంగాణ ప్రజలు ఆందోళనను ఉధృతం చేశారు. ఈ దెబ్బకు కాంగ్రెస్ పార్టీ తల వంచక తప్పలేదన్నారు. ప్రస్తుతానికి తమ పార్టీ ఎమ్మెల్యేల ను ఫిరాయింపులకు పాల్పడేందుకు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి మళ్లీ కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారు. చరిత్ర పునరావృతం అవుతుంది.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# నిరవధిక సమ్మెలోకి జూడాలు

**సికింద్రాబాద్ :**

గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు అత్యవసర సేవలు మినహా అన్ని సేవలను నిలిపి వేసి నిరవధిక స్ట్రైక్ లోకి దిగారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించమంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అదికార ప్రతినిధి డా. అజయ్ కుమార్ మాట్లాడుతూ తమ సమస్యలు పక్క రాష్ట్రంలో వలె ఇక్కడ కూడా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి రెగ్యులర్ గా స్టైఫండ్ ఇవ్వాలన్నారు. ప్రతి ప్రభుత్వ దవాఖానలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ కల్పించాలని, ఉస్మానియా హాస్పిటల్ కు నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. మా డిమాండ్లన్ని మా కోసం మాత్రమే కాదని ప్రజల కోసం, భవిష్యత్ తరాల కోసమేనని ప్రజలు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.

# కేజ్రీవాల్‌కు సుప్రీంలో షాక్

**న్యూఢిల్లీ, జూన్ 24:** ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మరోసారి షాక్ తగిలింది. ఆయన బెయిల్‌పై సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి ట్రయల్ కోర్టు తనకు మంజూరు చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించడంపై ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 26న విచారించనున్నట్లు వెల్లడించింది. హైకోర్టు ఆదేశాలు వచ్చే వరకూ వేచి చూడాలని స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఆయనకు మళ్లీ నిరాశే ఎదురైంది.కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే విధిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై.. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. విచారణ తొలి రోజే బెయిల్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే ఇవ్వాల్సిన అవసరం ఏముందని.. హైకోర్టు తన ఉత్తర్వులు వచ్చేంతవరకూ సీఎం ఎందుకు స్వేచ్ఛగా ఉండకూడదని అన్నారు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా బెయిల్ ఉత్తర్వులు ఉన్నాయని.. ఆయన విదేశాలకు పారిపోయే ప్రమాదం కూడా లేదని పేర్కొన్నారు. అయితే, కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈ నెల 26న విచారిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది.ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుకు సంబంధించి సీఎం కేజ్రీవాల్‌కు ఈ నెల 20న రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఈడీ.. హైకోర్టులో సవాల్ సవాల్ చేసింది. దీనిపై విచారించిన జస్టిస్ సుధీర్ కుమార్ జైన్, జస్టిస్ రవీందర్ దుడేజాతో కూడిన ధర్మాసనం ట్రయల్ కోర్టు నిర్ణయంపై స్టే విధించింది. దీనిపై కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. అక్కడా ఆయనకు నిరాశే ఎదురైంది.

# సారు...కారు... బేజారు..

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :




అందితే జుట్టు.. లేదంటే కాళ్లు.. ఈ సామెత పర్‌ఫెక్ట్‌గా సూటవుతుంది. మాజీ సీఎం, ప్రస్తుత బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు. ఎందుకీ మాట అనాల్సి వస్తుందంటే ఇప్పుడు ఆయన చేసే చర్యలు అలా ఉన్నాయి కాబట్టి మొన్న మొన్నటి వరకు.. అంటే అధికారం పోయేంత వరకు ఏ రోజైనా పార్టీ నేతలతో భేటీ అయ్యారా? కనీసం ఎమ్మెల్యేలతో అయినా మాట్లాడరా? లేదు. కానీ కాలం మహాచెడ్డది కదా.. ఎన్నికల ముందు వరకు వినీలాకాశంలో విహరిస్తున్న కేసీఆర్‌ను తమ ఓటుతో నేలకు దించారు ప్రజలు.దీంతో ఇప్పుడు అందరూ కనిపిస్తున్నారు.. అందరితో ముచ్చటించేందుకు ప్రయత్నిస్తున్నారు.. కాని అస్సలు కుదరడం లేదంట. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఏం నడుస్తోంది? ఇది ప్రశ్న.. ఎప్పుడూ ఖాళీ అవుతుందో అస్సలు సమజ్ అవ్వడం లేదు. ఇదీ సమాధానం.. ఎందుకంటే ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు నేరుగా కేసీఆర్ రంగంలోకి దిగినా పనులు కావడం లేదని ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లో వినిపిస్తున్న టాక్.కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి అన్నట్టుగా కాంగ్రెస్ వ్యూహాలు కనిపిస్తున్నాయి. ఏకంగా బీఆర్‌ఎస్ కీలక నేత, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి కండువా కప్పేశారు సీఎం రేవంత్ రెడ్డి.. ఆ వెంటనే ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జనారెడ్డితో భేటీ అయ్యారు. చూస్తుంటే ఉన్న 38 మంది ఎమ్మెల్యేల్లో ఓ 15 మంది వరకు జంప్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. దీంతో సీన్‌లోకి కేటీఆర్.. ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్‌రావు ఎంట్రీ ఇచ్చారు. కానీ పనవ్వడం లేదు.. ఎమ్మెల్యేలను కాపాడుకోలేని పరిస్థితి ఉన్నట్టు కనిపిస్తుంది. దీంతో ఆఖరిగా.. బ్రహ్మాస్త్రంగా కేసీఆరే నేరుగా రంగంలోకి దిగారు.పదేళ్ల తన పాలనలో ఎమ్మెల్యేలతో కేసీఆర్ ఎప్పుడైనా మాట్లాడారా.. ? నలుగురితో నారాయణ అన్నట్టుగా అందరిని సమావేశపరిచి మాట్లాడటమే. అది కూడా వేళ్లపై లెక్కపెట్టే అన్నిసార్లు జరిగాయి ఆ సమావేశాలు. వారు అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదన్న ఆరోపణలు ఎన్నో.. కానీ ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కేసీఆరే నేరుగా ఫోన్ చేసినా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఎమ్మెల్యే జంపింగ్స్‌తో కేసీఆర్‌లో టెన్షన్ మొదలైనట్టు తెలుస్తుంది.ఫామ్‌హౌస్‌లో హరీష్‌రావు, కేటీఆర్‌తో ప్రత్యేకంగా మీట్ అయ్యారు. అసలు ఎమ్మెల్యేలను ఆపడం ఎలా టాపిక్‌పై డిస్కషన్ చేశారు. ఎందుకంటే పోచారం లాంటి నేతే కాంగ్రెస్ చేరడం అనేది కేసీఆర్‌కు అస్సలు మింగుడు పడని అంశం. దీంతో ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని ఆరా తీశారు. జంప్ అయ్యే ఎమ్మెల్యేల లిస్ట్ తయారు చేశారు. వారికి నేరుగా కేసీఆర్ ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలుస్తుంది. పార్టీ మారవద్దని కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాలని హితబోధ చేసినట్టు తెలుస్తుంది. అయితే వారిని ఫామ్‌హౌస్‌కు రమ్మని పిలిచినా.. ఒక్కరు కూడా పట్టించుకోలేదని తెలుస్తుంది.అయితే కేసీఆర్‌కు రెండు రకాల టెన్షన్స్ మొదలైనట్టు తెలుస్తుంది. ఓ వైపు కాంగ్రెస్.. మరోవైపు బీజేపీ.. అవును.. బీజేపీ కూడా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై నజర్ పెట్టింది. రెండు పార్టీలు కూడా ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టాయి. ఒకటి రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ.. మరొకటి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ..దీంతో చాలా మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీలో చేరాలన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు నజర్ పెట్టినట్టు తెలుస్తోంది. అలాంటి నేతలంతా త్వరలో కాషాయ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. కానీ మెజార్టీ ఎమ్మెల్యేల చూపు కాంగ్రెస్‌వైపే ఉన్నట్టు తెలుస్తుంది. దీనికి సంబంధించి ఇప్పటికే జోరుగా మంతనాలు నడుస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ అగ్రనేత ఈ వ్యవహారాలను చక్కదిద్దుతున్నట్టు తెలుస్తోంది.పోచారం కాంగ్రెస్‌లో అధికారికంగా చేరడంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 38కు చేరింది. కనీసం తక్కువలో తక్కువ 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారనేది ప్రస్తుతం వినిపిస్తున్న టాక్.. మిగిలిన ఎమ్మెల్యేల చూపు బీజేపీవైపు ఉన్నట్టు కనిపిస్తుంది. మొత్తానికి అప్పుడు సిగలు పట్టుకొని పార్టీ నేతలను ఓ ఆట ఆడించిన కేసీఆర్.. ఇప్పుడు కాళ్లు పట్టుకొని ప్రాధేయపడేంత పని చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలుస్తుంది.

# కమలం... యాక్షన్ ప్లాన్ ఏంటీ

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :

తెలంగాణలో అధికారంలోకి రావాలని టార్గెట్ పెట్టుకున్న కమలనాథుల సంగతేంటి? వ్యూహం ఉందా? మాటలకే పరిమితం అవుతారా?తెలంగాణలో రాజకీయ పరిణామాలు స్పీడుగా మారుతున్నాయి. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ స్పీడ్ ను పెంచి దూకుడు మీద ఉంది. బీఆర్ఎస్, బీజేపీ సహా ఇతర పార్టీల నేతలను పార్టీ వైపుకు తిప్పుకోవడంలో హస్తం నేతలు సక్సెస్ అవుతున్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రేపో మాపో మరికొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నారనే టాక్ బలంగా వినిపిస్తోంది. దీంతో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ లో బీజేపీ ముఖ చిత్రం ఏ విధంగా ఉండబోతుందనేది హాట్ టాపిక్ గా మారింది.గత అసెంబ్లీ ఎన్నికల్లో మిషన్ 90 లక్ష్యంతో ప్రచారాన్ని ఊదరగొట్టిన బీజేపీ.. 90 అసెంబ్లీ స్థానాలు సాధిస్తామని చెప్పి బొక్క బోర్లా పడింది. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ గ్యారంటీ తో డబుల్ డిజిట్ స్థానాలకు లెక్కలేసుకున్న బీజేపీ.. కొంత లాభపడినప్పటికి, సింగిల్ డిజిట్ కే పరిమితం కావలసి వచ్చింది. కానీ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 అసెంబ్లీ స్థానాలు గెలుస్తామనే ధీమాతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2028 ఎన్నికలే టార్గెట్ గా ప్రణాళికలను అందుకోవాలంటే.. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ నిలబడాలని.. అందుకు గాను బీఆర్ఎస్ స్థానాన్ని భర్తీ చేసే ప్లాన్ లో బీజేపీ నేతలు తలమునకలు అవుతున్నారు.బీఆర్ఎస్ నేతలను బీజేపీలోకి తెచ్చుకొని.. కారు పార్టీని ఖాళీ చేయాలనే కమలం నేతల వ్యూహాలు మాత్రం బెడిసికొడుతున్నాయి. బీఆర్ఎస్ ను వీడుతున్న నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు యత్నించడం.. ప్రజల్లో ప్రజాపాలన పట్ల మంచి అభిప్రాయం ఉండటమే అందుకు కారణంగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో బీఆర్ఎస్ స్థానానికి బీజేపీ రావాలంటే.. ఆపరేషన్ కమలం స్పీడప్ చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచిస్తున్నారు.రాష్ట్రంలో కారు పార్టీని ఖాళీ చేసి, బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడుతుందా..? లేదా అనేదే అటుంచితే%ొ% ఆపరేషన్ లోటస్ లోకి వచ్చే నేతలు ఎవరున్నారు..? ఎవరొస్తారు..? అనే చర్చ బీజేపీలో జోరుగా సాగుతోంది. గ్రౌండ్ లేవల్లో పార్టీ బలంగా లేకుండా రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎలా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం అపరేషన్ లోటస్ పూర్తిగా విఫలం అయ్యిందనే విమర్శలు సైతం సొంత నేతల నుంచే రావడం నాయకులను విస్మయానికి గురి చేస్తున్నాయి. ఆపరేషన్ లోటస్ కు పడిన నేతలు కూడా ఎక్కువకాలం పార్టీలో ఇమడలేక తిరిగి సొంత గూటికి వెళ్లడం కమలం నేతల్లో కలవరం పుట్టిస్తోంది.ఈ క్రమంలోనే తాజాగా కేంద్ర కేబినెట్ లో అవకాశం రాని ప్రస్తుత ఎంపీలు సైతం అసంతృప్తితో ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. దాంతో ఎవరు ఎప్పుడు బీజేపీ నుంచి జంప్ అవుతారో తెలియని సస్పెన్స్ పార్టీ వర్గాల్లో నెలకొంది. మోడీ హవా తగ్గిందనడానికి మొన్నటి ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు రాకపోవడమే అనేది క్లియర్ కట్ గా నేతలను ఆలోచనలో పడేస్తోందని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే బీజేపీ రాష్ట్రంలో ప్రత్యామ్నాయం మాట పక్కన పెడితే.. ఉన్న క్యాడర్ ని కూడా కోల్పోయి.. జీరోకు పడిపోయే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలవాలని.. ఉవ్విల్లూరుతున్న బీజేపీ నేతలకు.. ప్రస్తుత పరిస్థితులు మాత్రం ఫిఫ్టీ ఫిఫ్టీగా ఉన్నాయి. స్థానాల విషయంలో లక్ష్యం నెరవేరకపోయినా.. బీఆర్ఎస్ స్థానం లోకి మాత్రం వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. బీఆర్ఎస్ ఖాళీ అయితే.. రాష్ట్రంలో కాంగ్రెస్ తరువాత స్థానంలో బీజేపీ ఉంటుంది. ప్రజలు తప్పకుండా బీజేపీ వైపు చూస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు.. బీజేపీని కూడా పట్టం కడతారని అంచనా వేసుకుంటున్నారు. ఆ నమ్మకంతోనే ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 స్థానాలు గెలుస్తామనే ధీమాతో బీజేపీ నేతలు ఉన్నారని చర్చ జరుగుతోంది. ఇక మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్, విచారణ సంస్థలే ప్రధాన అస్త్రాలుగా తెలంగాణలో ఆకార్ష్ కమలం స్పీడ్ పెంచాలనే ప్లాన్ లో ఉందనే టాక్ వినిపిస్తోంది.మొత్తంగా రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడుతాం.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 స్థానాలతో అధికారాన్ని చేపడతామని కలలు కంటున్న బీజేపీ ఆశలు.. నెరవేరుతాయా లేదా అనేది చూడాలి.

# ఢిల్లీలో.. బిజీబిజీగా రేవంత్

**లన్యూఢిల్లీ, జూన్ 24:** తెలంగాణ సీఎం , పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. ఆయన కంటే ముందే పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు కూడా ఢిల్లీ వెళ్లారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి పెండింగ్ లో ఉన్న కీలకమైన అంశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు హైకమాండ్ ఆమోదం కోసం రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. మంత్రివర్గంలో ఇంకా ఆరు ఖాళీలు ఉన్నాయి. కొన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. ఈ క్రమంలో కేబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు స్థానాల్లో నాలుగైదు స్థానాలను భర్తీ చేసేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారు. గతంలోనే హైకమాండ్ నుంచి అనుమతి తీసుకున్నారు. ఎవరెవరికి చాన్స్ ఇవ్వాలన్నదానిపై కసరత్తు జరిపిన రేవంత్ రెడ్డి ఆ మేరకు జాబితాతో హైకమాండ్ వద్దకు వెళ్లినట్లుగా తెలుస్తోంది. హైకమాండ్ అనుమతి తీసుకుని వారి పేర్లను ప్రకటించే అవకాశం ఉంది. మంత్రి వర్గ విస్తరణ తర్వాత వివిధ మంత్రుల శాఖలను కూడా మారుస్తారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రిగా ఉంటూనే ప్రస్తుతం పీసీసీ చీఫ్ గా కూడా వ్యవహరిస్తున్నారు రేవంత్ రెడ్డి. ఆయన పీసీసీ చీఫ్ బాధ్యతల నుంచి వైదొలిగి పార్టీ కోసం పని చేసే సీనియర్ నేతకు చాన్సివ్వాలనుకుంటున్నారు. ఈ క్రమంలో పీసీసీ పదవి కోసం పలువురు సీనియర్లు పోటీ పడుతున్నారు. తన సోదరుడిని మంత్రిని చేసి తనను పీసీసీ చీఫ్ ను చేయమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరుతున్నట్లుగా చెబుతున్నారు. ఆయన కూడా ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. రేవంత్ రెడ్డి ఈ సారి మహిళా, గిరిజన వర్గాలకు అవకాశం ఇస్తే మంచిదని సీతక్క పేరును ప్రతిపాదిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. సీతక్క కూడా ఢిల్లీ చేరుకున్నారు. మొత్తంగా పీసీసీ చీఫ్ ఎంపికపై హైకమాండ్ ఆలోచనలో ఎలా ఉన్నాయో.. కూడా ఈ సమావేశం తర్వాత ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి పెద్ద ఎత్తున వలసలు ఉన్నాయి. ఇరవై మందికిపైగా ఎమ్మెల్యేల చేరిక ఉండే అవకాశాలు ఉన్నాయి. బీఆర్ఎస్ పెద్దలకు అత్యంత సన్నిహితులు అనుకున్న వారికి మరో చాయిస్ లేకుండా వెంటనే కండువా కప్పేస్తున్నారు. మిగతా వారిని అందర్నీ ఒకే సారి పార్టీలో చేర్చుకోవాలనుకుంటున్నారు. ఎవరెవరు పార్టీలో చేరుతారన్న అంశంపై హైకమాండ్‌కు రేవంత్ రెడ్డి నివేదిక సమర్పించే అవకాశాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన తర్వాత తెలంగాణ కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

# విద్యార్థి బంధువులపై పాఠశాల యాజమాన్యం దాడి

### అక్రమ అరెస్టులు చేస్తున్నారంటూ ఏబీవీపీ నాయకులు ఆరోపణ

రంగారెడ్డి, జూన్ 24 (ప్రజాస్వరం) :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మేధా హైస్కూల్లో గత శనివారం ఒక విద్యార్థి పాఠశాలలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్కు గురయ్యాడు ఆ విద్యార్థి ప్రస్తుతం హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు ఈ విషయమై స్కూల్ యాజమాన్యం స్పందించడం లేదని ఈరోజు విద్యార్థి సంఘాలు మరియు విద్యార్థి యొక్క కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు చేరుకొని అక్కడ ధర్నా చేశారు ధర్నా చేస్తున్న సమయంలో స్కూల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్కూల్ వద్దకు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం జరిగింది. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న సమయంలో స్కూల్ యాజమాన్యంలో ఒక టీచర్ విద్యార్థుల యొక్క బంధువులపై దాడికి పాల్పడం వల్ల విద్యార్థి సంఘాలు మరియు బంధువులు ఆగ్రహానికి గురై పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# అసలైన లబ్దిదారులు గుర్తించే పనిలో సర్కార్

వరంగల్, జూన్ 24 (ప్రజాస్వరం) :




పేరుకే పథకాలను పేదల కోసం అంటారు తప్పా.. దాని వెనక లబ్ధిదారులు వేరే ఉంటారు. అలాంటి వాటికి చెక్ పెట్టాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అమలు చేయడానికి నిధులు సమకూరుస్తోంది. కేబినెట్ కూడా దానిపై ఓ నిర్ణయం తీసుకుంది. అయితే, నిజమైన లబ్ధిదారులకే రైతుల భరోసా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.అంతేకాదు.. గత ప్రభుత్వం శ్రీమంతులకు, ఫామ్ హౌజ్ ఓనర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారికి కూడా రైతుబంధు ఇచ్చిందని ఆరోపించింది. ఆయన బీఆర్ఎస్‌పై రాజకీయ విమర్శలు చేశారనుకోవడానికి లేదు. నిజంగానే ప్రజాధనం పెద్ద ఎత్తున లూటీ అయిందని లెక్కలు చెబుతున్నాయి. క్రాప్ లోన్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ మహానగరంలో కూడా పెద్ద ఎత్తున వ్యవసాయం చేస్తున్నట్టు చూపిస్తున్నారు.2023%-%24 ఏడాదిలో హైదరాబాద్ లో బ్యాంకర్లు రూ.1550 కోట్ల పంట రుణాలు ఇచ్చారు. ఇవి బ్యాంకులు చెబుతున్న లెక్కలే. గతే ఏడాడి మేడ్చల్ జిల్లాలో కేవలం 18,199 ఎకరాల భూమిలోనే పంటలు సాగవుతాయి. దానికి రూ. 242 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకులు టార్గెట్ గా పెట్టుకున్నాయి. కానీ.. ఏకంగా రూ.2386.48 కోట్ల రుణాలు మంజూరు అయ్యాయి. అవి కూడా క్రాప్ లోన్సే. అంటే సుమారు 1000 శాతం ఎక్కువగా లోన్లు ఇచ్చారు. అంత మొత్తంలో మేడ్చల్ జిల్లాలో పంటలు పండుతున్నాయా? అనేది చూడాలి. మరో విచిత్రం ఏంటీ అంటే.. క్రాప్ లోన్స్ ముంజూరులో మేడ్చల్ జిల్లా టాప్ ప్లేస్. అంటే.. గ్రామీణ జిల్లాల కంటే ఇక్కడే ఎక్కువగా పంటలు పండుతున్నాయన్నది బ్యాంకర్ల లెక్క.మేడ్చల్ తర్వాతి స్థానంలో రంగారెడ్డి జిల్లా ఉంది. హైదరాబాద్ మహానగరంలో వ్యవసాయ రుణాలు మంజురు చేయడం ఏంటి అని గత ప్రభుత్వ పెద్దలు అడిగింది లేదు. దీని వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద రైతులకు అందాల్సిన రుణాలు అందడం లేదు. నిజమైన రైతులకు న్యాయం జరగడం లేదు. రైతు బంధు కూడా ఇలాగే అమలు చేశారనే వాదనలు కూడా ఉన్నాయి.సీఎం రేవంత్ రెడ్డి నిజమైన రైతులకే రైతు భరోసా అందిస్తామని ప్రకటించారు. నిజంగానే సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు రియల్ ఎస్టేట్ వ్యాపారలను, భూ స్వాములను తప్పిస్తే పేదలకు మరింత ఎక్కువ సాయం చేయొచ్చు. అదే సమయంలో ప్రభుత్వానికి కూడా భారం తగ్గుతోంది. రైతు భరోసా విషయంలోనే కాదు.. రుణ మాఫీ కూడా ఇలాగే చేయాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం కూడా రుణమాఫీ విషయంలో కీలక ప్రకటన చేసింది. ట్యాక్సులు కడుతున్న వారు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు రుణమాఫీ ఉండదని ప్రకటించారు. వారితో పాటు వ్యవసాయమే చేయకుండా రుణాలు తీసుకుంటున్న వారిని కూడా గుర్తించి తప్పించాలి. అప్పుడే రైతాంగానికి మరింత మేలు జరుగుతోంది.రైతు భరోసా విషయంలో ప్రభుత్వం ఎలాంటి విధి విధానాలు అమలు చేస్తుందో చూడాలి. 5 ఎకరాలు కంటే ఎక్కువగా ఉన్నవారిని పక్కకు తప్పించే అవకాశం ఉందని చర్చ నడుస్తోంది. అదే జరిగితే ఓ విధంగా మంచిదనే చెప్పాలి. ఇది జరగాలంటే కొన్ని వర్గాల నుంచి ఒత్తిళ్లు రావచ్చు. అయితే, ఆ ఒత్తిళ్లకు తలొగ్గడానికి అక్కడ ఉన్నది కేసీఆర్ కాదని.. రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. నిజంగా రేవంత్ రెడ్డి నిజమైన రైతులను గుర్తించి పథకం అమలు చేస్తే ప్రభుత్వానికి కొంత భారం తగ్గినట్టే.

# మహిళలపై వీధి కుక్కల దాడి...

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం) :

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. ఒంటరిగా తిరిగి పిల్లలు, మహిళలపై సామూహికంగా దాడి చేస్తున్నాయి. తాజాగా మణికొండలోని చిత్రపురి కాలనీలో ఓ మహిళపై 15 కుక్కలు ఒక్కసారిగా దాడికి తెగబడ్డాయి. సుమారు అరగంటపాటు ఆ మహిళ వాటితో పోరాటం చేసింది. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.కాలనీలోని ఓ అపార్టుమెంటులో నివాసముండే మహిళా స్కూటీపై అక్కడికి వచ్చింది. వాహనం పార్కు చేసి వస్తుండగా అక్కడే ఉన్న 15 కుక్కలు ఆమె వెంటపడ్డాయి. ఆమే భయంతో పరిగెత్తడంతో తరిమాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఆ మహిళ ధైర్యం చేసి కుక్కలు తనపై దాడి చేయకుండా వాటిని అదరగొట్టే ప్రయత్నం చేసింది. కాలి చెప్పులు తీసి కొట్టే ప్రయత్నం చేయడంతో కొంత దూరం వెళ్లిన కుక్కలు తర్వాత మళ్లీ ఆమె వెంటపడ్డాయి. అయినా సదురు మహిళ కుక్కలు తనను కరవకుండా అదరగొడుతూనే ముందుకు సాగింది. ఒక సందర్భంలో ఆమె కిందపడిపోయింది. దీంతో కుక్కలు ఒక్కసారిగా దాడికి యత్నించాయి. అయితే బాధితురాలు తన చేతిలో ఉన్న చెప్పుతో వాటిని హడలగొట్టింది.సుమారు అరగంటపాటు సదరు మహిళ కుక్కలతో పోరాటం చేసింది. ఈ క్రమంలో అపార్టుమెంటువాసులు అటుగా రావడంతో వారు దాడికి యత్నిస్తున్న కుక్కలను హడలగొట్టారు. దీంతో అప్పటి వరకు ఆమె వెంటపడిన కుక్కలు అక్కడి నుంచి పారిపోయాయి. ఈ దృశ్యాలన్నీ అపార్టుమెంటు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ వీడియపై నెటిజన్లు స్పందిస్తున్నారు. వీధికుక్కలు చెచ్చిపోతున్నా.. జీహెచ్ఎంసీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఒంటరిగా మహిళలు, చిన్న పిల్లలు బయట తిరగలేకపోతున్నారని ఆరోపిస్తున్నారు. వీధికుక?్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలా మంది పిల్లలపై కుక్కలు దాడి చేశాయని కొంతమంది పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పలువురు పేర్కొంటున్నారు.వీధి కుక్కలపై ప్రేమతో స్థానికులు వాటికి రోజు ఆహారం వేస్తున్నారని, దీంతో వీధి కుక్కలు అక్కడ పెరిగి పెద్దవై.. మనుషులపై దాడి చేస్తున్నాయని బాధిత మహిళ భర్త సీసీ ఫుటేజీ దృశ్యాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వీధికుక్కలపై ప్రేమ ఉంటే.. వాటిని దూరంగా తీసుకెళ్లి ఆహారం పెట్టాలని సూచించారు. స్థానికంగా ఆహారం పెట్టడం మనుషులకు ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు. ఎవరూ వీధి కుక్కలకు అక్కడే ఆహారం పెట్టకూడాదని వేడుకున్నాడు.

# మరోమారు పోలీస్ ఆఫీసర్‌గా విజయశాంతి




నందమూరి కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్నది. ఈ మూవీలో అలనాటి స్టార్ హీరోయిన్ విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. వైజయంతీ ఐపీఎస్‌గా ఆమె ఇందులో కనిపించనున్నారు. సోమవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీని తెరకెక్కిస్తున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకి ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫాంకు పౌరుషం వస్తుంది.. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం..' అంటూ కళ్యాణ్ రామ్ చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సయీ మంజ్రేకర్ కథానాయిక.



# వార్-2 మూవీపై భారీ అంచనాలు

టాలీవుడ్, బాలీవుడ్ మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి వార్ 2. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో స్పై జోనర్‌లో వస్తోన్న ఈ మూవీలో గ్లోబల్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. వార్ 2 ÷-లక్లైమాక్స్‌లో తారక్, హృతిక్ రోషన్ మధ్య స్టన్నింగ్ ఫైట్ సీక్వెన్స్ ఉంటుందన్న ÷ట్ మాస్టర్ అనల్ అరసు ఇప్పటికే ఓ అప్‌డేట్ ఇచ్చి మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతుండగా.. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది.వార్ 2 సినిమాకే హైలెట్‌గా నిలిచే ఓ సీన్ ఉందట. ఇంతకీ అదేంటో తెలుసా..? హృతిక్ రోషన్, తారక్ మధ్య వచ్చే హై స్పీడ్ బోట్ ఛేజ్ సీక్వెన్స్. భారత సినీ చరిత్రలో ఇదివరకెన్నడూ చూడని విధంగా.. మరణ మృదంగం వాయిస్తున్నట్టుగా ఒళ్లు గగుర్పొడిచేలా ఈ యాక్షన్ సన్నివేశం ఉండబోతుందని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలే ఆరు రోజుల పాటు ఈ సీక్వెన్స్‌ను చిత్రీకరించినట్టు సమాచారం. అయాన్ ముఖర్జీ టీం ఇప్పటికే లాంఛ్ చేసిన వార్ 2 గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. వార్ 2 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జఖీఈ ÷ూ జనితిలనబలో ఇప్పటికే వచ్చిన ఏక్తా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్, టైగర్ 3 సినిమాలు బి÷-గగెస్ట్ హిట్‌గా నిలిచాయి. వీటి తర్వాత వస్తున్న ఆరో ప్రాజెక్టు కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

---




# చిరంజీవితో హరీష్ శంకర్ డైరెక్షన్

సిల్వర్ స్క్రీన్‌పై కొన్ని కాంబినేషన్స్ రాబోతున్నాయంటే క్రేజ్ మామూలుగా ఉండదు. అలాంటి కాంబో మెగాస్టార్ చిరంజీవి -హరీష్ శంకర్. చాలా రోజుల క్రితమే ఈ ఇద్దరు ఓ సినిమా చేయబోతున్నారంటూ నెట్టింట వార్త తెరపైకి వచ్చిందని తెలిసిందే. అయితే మళ్లీ ఎలాంటి అప్‌డేట్ బయటకు రాలేదు. తాజాగా చిరు ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడన్న వార్త ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. హరీష్ శంకర్ ఇటీవలే చిరంజీవికి డ్రాఫ్ట్‌ను వివరించగా.. ఓకే చెప్పాడట. అంతేకాదు ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించనుందని ఇన్‌సైడ్ టాక్. ఇదే విషయాన్ని త్వరలోనే ప్రకటించనున్నారట మేకర్స్. చిరంజీవి ప్రస్తుతం టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విశ్వంభర. మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. సోషియో ఫాంటసీ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. విశ్వంభర తర్వాత చిరంజీవి ప్రకటించబోయే కొత్త సినిమా ఇదే అవనుందని అప్పుడే చర్చించుకోవడం మొదలుపెట్టారు అభిమానులు. మిరపకాయ్, గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్స్‌తో ఇండస్ట్రీని షేక్ చేసిన హరీష్ శంకర్ ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు.

# రాజమౌళి,మహేశ్ బాబు కాంబో

### త్వరలోనే పట్టాలకెక్కనున్నట్లు కీరవాణి వెల్లడి

మహేశ్ బాబు- రాజమౌళి కాంబోలో తెరకెక్కనున్న 'ఎస్ఎస్ఎంబీ 29' చిత్రానికి సంబంధించిన ఏ వార్త బయటకు వచ్చినా విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం అవుతోందా? అని అటు మహేష్, ఇటు, రాజమౌళి ఫ్యాన్ ఆతురతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు కీరవాణి ఓ అప్‌డేట్ ఇచ్చారు. 'నేను ఇప్పటి వరకూ ఈ సినిమా సంగీత పనులు మొదలుపెట్టలేదు. ఈ వారమే స్టోరీ లాక్ అయింది. టెస్ట్ షూట్స్ జరుగుతున్నాయి. జులై లేదా ఆగస్టులో మ్యూజిక్ వర్క్ మొదలుపెడతా' అని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' చిత్రానికి సంగీతం అందిస్తున్న కీరవాణి తాజాగా ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు చెప్పారు. ఇక మహేశ్, రాజమౌళి కలిసి సినిమా చేస్తున్నారనే విషయం తెలిసిన క్షణం నుంచే అభిమానుల్లో అంచనాలు మొదలయ్యాయి.. ప్రపంచాన్ని చుట్టి వచ్చే సాహసికుడి కథ కావడం, అందులో మహేశ్ మునుపెన్నడూ





చూడని లుక్‌లో కనిపిస్తారనే టాక్ రావడంతో మరింత ఆసక్తి నెలకొంది. ఇప్పటికే మహేష్‌పై ఎనిమిది రకాల లుక్ టెస్ట్‌లు జరిగాయి. అందులో ఏదో ఒక లుక్ ÷నైల్ చేస్తారని టాక్. అలాగే థాయ్‌ల్యాండ్‌లో స్కేటింగ్ తదితర శిక్షలు తీసుకొచ్చారు మహేశ. కె.ఎల్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## 'థీమ్ ఆఫ్ కల్కి' పేరుతో ఓ వీడియో విడుదల

ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' ఈ నెల27న విడుదలకు సిద్ధమైంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా 'థీమ్ ఆఫ్ కల్కి' పేరుతో ఓ వీడియోను విడుదల చేసింది. నటి శోభనతోపాటు పలువురు నృతకారిణిలు మథురలో నృత్య ప్రదర్శన చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ సరసన దీపికా పదుకోన్ నటించగా అమితాబ్ బచ్చన్, కమల్ హాస న్ దిశాపటానీ కీలక పాత్రలు పోషించారు.




# విషయం నా దృష్టికి వచ్చింది.. క్షమించండి: అక్కినేని నాగార్జున



టాలీవుడ్ అగ్ర నటుడు, హీరో అక్కినేని నాగార్జున తన అభిమానికి క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వెళ్తున్న ఆయనను కలిసేందుకు ఓ అభిమాని ప్రయత్నించగా.. పక్కనే ఉన్న బౌన్సర్లు అతిగా ప్రవర్తించారు. సదరు అభిమానిని నిర్దయగా పక్కకు ఈడ్చి పడేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియా మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో నాగార్జున స్పందించారు. విషయం తన దృష్టికి వచ్చిందని, ఇలా జరిగి ఉండకూడదని విచారం వ్యక్తం చేశారు. "ఆ వ్యక్తికి నేను క్షమాపణలు చెబుతున్నాను. భవిష్యత్తులో ఇలా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని చెబుతున్నాను !!" అని నాగార్జున పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు.

Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154